మార్క్సిస్టు - లెనినిస్టు మూలసూత్రాలు :

మొదటి భాగం

గతితార్కిక భౌతికవాదం

(మార్క్సిస్టు - లెనినిస్టు ప్రపంచ దృక్పథం యొక్క
తాత్విక పునాదులు)

అనువాదం :

కంభంపాటి సత్యనారాయణ

విశాలాంధ్ర ప్రచురణాలయం
మాచవరం పోస్టు : : విజయవాడ - 4

ప్రచురణ నెం. 523
ప్రథమ ముద్రణ :
నవంబరు 1963
కాపీలు 3000

ఆంగ్లంలో "మార్క్సిస్టు - లెనినిస్టు మూలసూత్రాలు" రెండవ కూర్పు : విదేశభాషా ప్రచురణాలయం, మాస్కో, 1963.

రష్యన్ నుంచి అంగ్లంలోకి అనువాదం ;
సంకలన కర్త : క్లెమెన్స్ దత్.

వెల : రు. 2-80

ఈ పుస్తకంలోని వ్యాఖ్యలు తెలుగు అనువాదకునివి.

ముద్రణ :
స్వతంత్ర ఆర్టు ప్రింటర్సు,
విజయవాడ - 4.

విషయానుక్రమణిక

★

రెండవ కూర్పుకు ప్రవేశిక

"మార్క్సిస్టు-లెనినిస్టు మూలసూత్రాలు" మొదటి కూర్పును సోవియట్ పత్రికలూ, ప్రపంచ కమ్యూనిస్టు పత్రికలూ ఎంతగానో కొనియాడాయి. అనేకమంది మార్క్సిస్టు ప్రచారకులూ, బోధకులూ దాని విలువను గుర్తించారు. అది ఒక ఉపయోగకరమైన బోధనాగ్రంథంగా పరిగణించారు. దాన్ని సులభంగా అర్థం చేసుకోవచ్చునని అభిప్రాయపడ్డారు. అదే సమయంలో, మార్క్సిజం-లెనినిజంను ఒక సమగ్రమైన శాస్త్రంగా ఆ గ్రంథం వివరించిందనీ, యీ కర్తవ్యాన్ని సమర్థతతోను, శాస్త్రీయంగాను నెరవేర్చిందనీ వారు ప్రశంసించారు. అది అనేక భాషల్లోకి అనువదింపబడింది. (ఇంగ్లీషు, ఫ్రెంచి, జర్మన్, ఇటాలియన్, స్పానిష్, చైనీస్, జపనీస్ మొదలైన భాషల్లోకి).

ఈ రెండవకూర్పు మొదటి కూర్పులోని ప్రధాన వస్తువునూ, దాని అంగ నిర్మాణాన్నీ అలాగే వుంచి, విలువగల కొన్ని నూతన భావాలను చేర్చి సునంపన్నం చేసింది. ఆధునిక మార్క్సిస్టు - లెనినిస్టు ప్రమాణ పత్రాల్లో అత్యంత ప్రధానమైన సోవియట్ కమ్యూనిస్టుపార్టీ కార్యక్రమంతోనూ, సోవియట్ కమ్యూనిస్టుపార్టీ 22 వ మహాసభ ఆమోదించిన యితర

పత్రాల్లోనూవున్న సూత్రీకరణల్లోని భావాలే అవి. 1960 లో కమ్యూనిస్టు, వర్కర్స్‌పార్టీల సమావేశం చేసిన అతిముఖ్యమైన నిర్ధారణలను, అంచనాలను కూడా అది దృష్టిలో వుంచుకొంది. ఈ గ్రంథం యింకా పెద్దదికాకుండా చూచేందుకు చాలా భాగాలను సంగ్రహ మొనర్చవలసివచ్చింది. అయితే, యిదివరకటి మాతృకలోని వస్తువునుబట్టి చూస్తే మాత్రం, అలా సంగ్రహ మొనర్చవలసిన అవసరంలేదు. ఈ కూర్పును తయారు చేసే టప్పుడు గ్రంథకర్తలు పాఠకులనుంచి వచ్చిన అనేక సూచనలనూ గ్రంథ సమీక్షల్లోని అనేక అభిప్రాయాలనూ దృష్టిలో ఉంచుకున్నారు.

రెండవ కూర్పును తయారుచేయడంలో ప్రధానంగా కృషిసల్పినవారు ఓ. వి. క్యుసినెన్ (రచయితల గ్రూపుకు నాయకుడు) వై. ఎ. అర్బాటోవ్, ఎ. ఎస్. బెల్యకోవ్, ఎస్. ఎల్. వైగోడ్‌స్కీ, ఎ. జి. మైలికోవ్‌స్కీ, ఎల్. ఎం. షీడిన్‌లు. వీరుగాక, ఒక్కొక్క అధ్యాయాన్నే సంస్కరించేందుకు ఎఫ్. ఎం. బుర్లాట్‌స్కీ ఎన్. ఐ. ఐవనోవ్ బి. ఎం వీబ్జన్, ఎ. ఎ మకరోవ్‌స్కీ వై. పి. సిటోర్కొవ్‌స్కీలు కూడా కృషి చేశారు.

మార్క్సిస్టు - లెనినిస్టు ప్రపంచదృక్పథం

ఉపోద్ఘాతం

"మార్క్స్ ఉపదేశాలు వాస్తవికమైనవి;
అందుచేతనే వాటిశక్తి అనంతమైనది."

— లెనిన్

మనం మార్క్సిస్టు–లెనినిస్టు మూలసూత్రాల్లో పరిణతి సంపాదించాలంటే, పట్టుదలతోను ఏకాగ్రతతోను అధ్యయనం చేయాలి. అంటే చాలాకష్టపడాలి; చాలాకాలాన్ని అందుకు వ్యయపరచాలి. అలాంటి అధ్యయనంవల్ల కలిగే ప్రయోజనం ఏమిటి?

క్లుప్తంగా చెప్పాలంటే, దానివల్ల మనకు ప్రపంచాన్ని గురించి సమ్యక్‌దృష్టి ఏర్పడుతుంది. ఇదే ఆధునికయుగంలో అత్యంత అభ్యుదయకరమైన దృష్టి. మార్క్స్. లెనిన్‌ల మహోపదేశాల్లోని ప్రధాన విషయాలన్నీ యీ దృక్పథంలో అన్యోన్య సంబంధం గల ఏకైక సిద్ధాంతంగా మేళవింపబడ్డాయి. వాటిని మేము క్రింది వరుసలో వివరించాం:

మార్క్సిస్టు - లెనినిస్టు తత్వశాస్త్రం. ఇందులో చారిత్రక భౌతిక వాదం కూడా చేరి ఉంది.

మార్క్సిస్టు - లెనినిస్టు అర్ధశాస్త్రం.

ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమం యొక్క సిద్ధాంతం, ఎత్తుగడలు. ఇందులో, ఆధునిక ప్రజాతంత్ర ఉద్యమం లోని అత్యంత ప్రధానమైన ధోరణులపై మార్క్సిస్టు - లెనినిస్టు అంచనా కూడ ఉంది.

సోషలిజం, కమ్యూనిజంకు సంబంధించిన సిద్ధాంతం.

ఒక్క గ్రంథంలో మార్క్సిస్టు-లెనినిస్టు జ్ఞానసంపదనంతా యిమడ్చడం సాధ్యం కాదనే విషయం స్పష్టం. మేమీగ్రంథంలో మూలసూత్రాలను మాత్రమే తెలియజేశాం.

ప్రపంచాన్ని గురించిన దృక్పథాలు చాలా ఉన్నాయి. వాటిలో కొన్ని అభ్యుదయకరమైనవి. మరికొన్ని అభ్యుదయనిరోధకమైనవీను. అభ్యుదయనిరోధక దృక్పథాల్లో కొన్ని ప్రాచీన విశ్వాసాలమీద, మూఢనమ్మకాలమీద ఆధారపడివున్నాయి. మానవులు లోకాతీతమైన ఒకమహావ్యక్తి మీదా, ఆయన ప్రతినిధులైన పురోహితులు చక్రవర్తులమీదా గుడ్డిగా ఆధారపడి వుండాలని యీదృక్పథాలు మతవిశ్వాసకుల్ని ఒప్పించేందుకు ప్రయత్నిస్తాయి. ఇతర తాత్విక సిద్ధాంతాలు భగవంతుని అస్తిత్వాన్ని బహిరంగంగా సమర్ధించకపోయినా, విజ్ఞానశాస్త్రంలో (Science) తమకు నమ్మకముందని చెప్పుకొంటున్నా, భౌతిక ప్రపంచం వాస్తవమనే విశ్వాసాన్ని నాశనంచేసేటందుకు అవి కొన్నిజటిలమైన, అవాస్తవికమైన వాదనలు తీసుకొస్తూఉంటాయి.

అత్యంత ఆకర్షణీయమైన ఆధునిక భావవాద (Idealist) ధోరణులను ప్రచారం చేసేవారు యీ మార్గమే అవలంబిస్తారు. వారిలో చాలమంది లోకాతీత శక్తుల్ని నమ్మరు. అయితే, వీరు బూర్జువాసమాజంలోని సంప్ర

దాయాల, దురభిప్రాయాల తాకిడికి లోనై లోకాతీతశక్తుల్లో నమ్మకం ఉంచ కూడదని చెప్పేందుకు యిష్టపడరు. ప్రకృతి భౌతికమైనదా కాదా అనే విష యంలో నూతన శాస్త్ర పరిశోధనలు అనుమానానికి తావిస్తున్నాయని వీరం టారు. వీరిని ఈశ్వరవాదులు, పురోహితులు బలపరుస్తారు. ప్రపంచం భౌతికమైనది కాదని ప్రజలచేత నమ్మించగలిగిననాడు దేన్నైనా ప్రజలు నమ్మేటట్లు చేయవచ్చునని వీరి అభిప్రాయం.

మెరిసే ప్రతిదీ బంగారమెలాకాదో, విజ్ఞానశాస్త్రంలా కనబడే ప్రతిదీ విజ్ఞానశాస్త్రం కాదు. ముఖ్యంగా, ఆధునికయుగంలో అనేక భావవాద ధోర ణులు తమ అశాస్త్రీయతను కప్పిపుచ్చుకొనేటందుకు శాస్త్రీయ ముసుగును తగిలించుకోడానికి కుతూహలపడ్డం చూస్తున్నాం. నిజం చెప్పాలంటే, భావవాదులు శాస్త్రీయ వాస్తవాలవల్ల లభిస్తున్న ప్రబలమైన సాక్ష్యాన్ని చూచి భీయపడుతూ, ఆ వాస్తవాలను మరుగుపరచడానికి లేదా అపభ్రంశమొనర్చ డానికి ప్రయత్నిస్తున్నారు.

మిగతా తత్వశాస్త్ర ధోరణుల్లో లేని విశిష్ట లక్షణాలు మార్క్సిజం - లెనినిజంలో ఉన్నాయి. వాటికీ, మార్క్సిజం - లెనినిజంకీ గల తేడా యీవిశిష్టలక్షణాల్లోనే ఉంది.

మార్క్సిజం - లెనినిజం లోకాతీతశక్తుల్నిగాని, సృష్టికర్తల్నిగాని గుర్తించదు. వాస్తవికతమీదనే, వాస్తవికప్రపంచంమీదనే అది పూర్తిగా ఆధారపడుతుంది. మానవజాతిని అది యుగయుగాల మూఢవిశ్వాసాల నుండి, మానసికదాస్యంనుండి శాశ్వతంగా విముక్తిచేస్తుంది; స్వతంత్ర ఆలోచనను, నిలకడగల భావాలను ప్రోత్సహిస్తుంది.

మార్క్సిజం - లెనినిజం ప్రపంచాన్ని ఉన్నదున్నట్లు వీక్షిస్తుంది; స్వర్గాన్నిగాని, నరకాన్నిగాని దానికి జతపరచదు. మానవునితోసహా యావత్తు ప్రకృతి వేర్వేరు గుణధర్మాలతో కూడిన (Properties) పదార్థమే (Matter) వన్న వాస్తవంనుంచి అది బయల్దేరుతుంది.

అట్టి ప్రకృతి. ఆ ప్రకృతిలోని భాగాలు నిరంతరం అభివృద్ధి చెందుతూ ఉంటాయి. ఏ నియమాలను (Laws) బట్టి అవి అభివృద్ధి చెందుతాయో నిర్ణయించేది భగవంతుడూకాదు; మానవుని ఇచ్ఛకాదు. ప్రకృతిలోనే ఆ నియమాలు స్వతస్సిద్ధంగా ఉంటాయి. వాటిని మనం సమగ్రంగా తెలుసుకోవచ్చు. ప్రపంచంలో స్వతస్సిద్ధంగా తెలుసుకోలేని విషయాలంటూ లేవు; ఇప్పటికింకా మనకు తెలియని విషయాలు మాత్రమే ఉన్నాయి. వాటినికూడా మనం తెలుసుకోవచ్చు.

మార్క్సిస్టు-లెనినిస్టు ప్రపంచ దృక్పథం విజ్ఞానశాస్త్రం నుండే ఉత్పన్న మవుతుంది: విజ్ఞానశాస్త్రాన్నే నమ్ముతుంది. అయితే ఆ విజ్ఞాన శాస్త్రం వాస్తవికత నుంచి, జీవితానుభవం నుంచి వేరుచేయబడకుండా మాత్రం ఉండాలి.

ప్రకృతి మాత్రమేకాక, మానవసమాజం కూడా కొన్ని భౌతిక నియమాల (Objective laws) ననుసరించి *అభివృద్ధిచెందుతుందనీ*, ఆ భౌతిక నియమాలు మానవుని యిచ్ఛమీద ఆధారపడవనీ మార్క్సిజం-లెనినిజం బోధిస్తుంది.

సమాజ పరిణామానికి సంబంధించిన నియమాలను వెలుగులోకి తీసుకురావడం ద్వారా, మార్క్సిజం ప్రపంచ చరిత్రను సిసలైన విజ్ఞాన శాస్త్ర స్థాయికి చేర్చింది. ప్రతి సామాజిక వ్యవస్థయొక్క స్వభావాన్ని అది వివరించగలదు; ఒక దశనుంచి యింకొక దశకు సమాజం ఎలా అభివృద్ధి చెందుతుందో చెప్పగలదు. ఇది విజ్ఞానశాస్త్రంలో అద్భుతమైన విజయం.

బూర్జువా సమాజ విజ్ఞానశాస్త్రజ్ఞులు (Sociologists), ఆర్థికవేత్తలు (Economists), చరిత్రకారులు చారిత్రక భౌతికవాదాన్ని (Historical Materialism) ఖండించలేకపోయారు; బూర్జువా శాస్త్రజ్ఞుల్లో అధిక సంఖ్యాకుల ఆమోదం పొందగలిగే మరొక సూత్రంతోనైనా దాన్నెదుర్కో లేకపోయారు. అయినప్పటికీ, చాలామంది బూర్జువా శాస్త్రజ్ఞులీ వాదు

మొండిగా చారిత్రక భౌతికవాదాన్ని తిరస్కరిస్తున్నారు. ఎందువల్ల? పెట్టుబడిదారీ విధానం యొక్క "శాశ్వతత్వాన్ని" అది తిరస్కరిస్తుంది గనుక. మానవసమాజం కొన్ని భౌతికనియమాల ననుసరించి ఒక వ్యవస్థ నుండి మరోవ్యవస్థకు పరివర్తన చెందడం తథ్యం. అందుచేత పెట్టుబడిదారీ వ్యవస్థ కూడ పతనంచెంది అంతకంటె అభివృద్ధికరమైన వ్యవస్థ ఆవిర్భవించి తీరుతుంది. కాని ఈ విషయాన్ని పెట్టుబడిదారులేకాక వారిమీద భౌతికం గాను, సాంస్కృతికంగాను ఆధారపడిపడే శాస్త్రజ్ఞులు కూడ అంగీకరించ డానికి ఎంతో వెనుకాడతారు; బాధపడతారు.

ఇంతవరకు వర్గసమాజాల (Class societies) చరిత్రలో పాలక వర్గం ఎన్నడూ తన వ్యవస్థ కూలిపోవడం తథ్యమని నమ్మియుండలేదు. బానిసయజమానులు తమ వ్యవస్థ చిరస్థాయిగా నిలిచియుంటుందని గట్టిగా విశ్వసించారు. కారణం అది భగవదేచ్ఛ ప్రకారం ఏర్పడిందేగా! అలాగే, వారితర్వాత వచ్చిన ఫ్యూడల్ ప్రభువులు భగవదేచ్ఛవల్లనే ఫ్యూడల్ వ్యవస్థ ఏర్పడిందనీ, అది శాశ్వతంగా నిలిచియుంటుందనీ నమ్మారు. కాని వారు బూర్జువా వర్గానికి తలవొంచ వలసివచ్చింది. ఈ వర్గం కూడా. పెట్టుబడిదారీవిధానం "శాశ్వత" మైనదనీ, "అప్రతిహతమైన"దనీ భ్రమ లల్లుకొని సంతృప్తిచెందారు. విద్వాంసులైన చాలామంది సమాజ విజ్ఞాన శాస్త్రజ్ఞులూ, చరిత్రకారులూ పెట్టుబడిదారీవిధానంతో తెగతెంపులు చేసుకో డానికి యిష్టంలేక. సామాజికవ్యవస్థలు (Social systems) కొన్ని స్వతస్సిద్ధమైన నియమాలప్రకారం అభివృద్ధి చెందుతాయనే విషయాన్నీ. ఆ నియమాలు పాలకవర్గాల లేదా వారి సిద్ధాంతవేత్తల యిచ్ఛకు లోబడవనే విషయాన్నీ ఖండించేందుకు సర్వవిధాలా ప్రయత్నిస్తున్నారు.

కాబట్టి, బూర్జువా సిద్ధాంతవేత్తలు మార్క్సిస్టు చారిత్రక దృక్పథంపై తీవ్రమైన పోరాటం జరుపుతున్నారంటే కారణం అది పొరబాటు దృక్పథ మవడంవల్ల కాదు; సరియైన దృక్పథమవడంవల్లనే.

ప్రకృతిశక్తులు, సామాజికశక్తులు ఏ నియమాల ప్రకారం నడుస్తూ అభివృద్ధి చెందుతున్నాయో, ఆ నియమాలను వెలుగులోకి తీసుకువస్తే పిసరైన విజ్ఞానశాస్త్రం ఎన్నో కొత్త విషయాలను ముందుగానే గ్రహించగల్గుతుంది. సమాజాభివృద్ధి నియమాలను గురించి తెలియజేసే మార్క్సిస్టు విజ్ఞానశాస్త్రం అనేక సామాజికవైరుధ్యాల (Contradictions) వంకరటింకరమార్గాల్లోనుండి సరియైన మార్గం చూపెట్టడమే కాక, ముందు ముందు ఏలాంటి పరిణామాలు (Phenomena) జరుగుతాయో, చారిత్రకాభివృద్ధి ఏ దిశలో కొనసాగుతుందో, ఏ దశలుగా అది రూపుదీర్చుకొంటుందో కూడ తెలుసుకోడానికి సహాయం చేస్తుంది.

ఈవిధంగా, మార్క్సిజం - లెనినిజం భవిష్యత్తులోకి తొంగిచూడ్డానికి, చారిత్రక పరిణామాల రూపురేఖల్ని ముందే కనిపెట్టడానికి చక్కని సాధనం. ఈ "కాలదర్శిని"తో మనం మానవజాతియొక్క ఉజ్వల భవిష్యత్తును చూడవచ్చు. మానవుడు చరిత్రలో చిట్టచివరి దోపిడీవ్యవస్థ అనదగు పెట్టుబడిదారీ విధానం (Capitalism) నుండి విముక్తిచెంది తీరుతాడని మనం గ్రహించవచ్చు. కాని అభ్యుదయ శాస్త్రవేత్తలు దేనినీ ముందుగా కనిపెట్టలేరంటూ వాదించే బూర్జువాశాస్త్రవేత్తల్ని ఈ మార్క్సిస్టు "కాలదర్శిని" ని ఉపయోగించి చూడవలసిందని కోరితేమాత్రం, వారు కళ్ల మూసివేసుకుంటారు. భవిష్యత్తులోకి తొంగిచూడ్డం అంటే వారి కంత భయం.

కాని, మార్క్సిస్టులకు భవిష్యత్తు అంటే భయం లేదు. గొప్ప భవిష్యత్తు గల వర్గానికి (కార్మికవర్గం-అను.) వారు ప్రతినిధులు. భ్రాంతుల (Illusions) వల్ల వారి కెట్టి ఉపయోగమూ లేదు. ఆ భ్రాంతులు వాస్తవిక విషయాలతో విజ్ఞానశాస్త్రంతో, సంపర్క మేర్పడిన వెంటనే పటాపంచలవుతాయి.

లెనిన్ నాయకత్వం క్రింద రష్యన్ మార్క్సిస్టులు, రష్యాలో సోషలిస్టు విప్లవానికి పరిస్థితులు పరిపక్వ మయ్యాయనీ, దాన్ని సాధించడం చారిత్రక కర్తవ్యమనీ ముందుగా గ్రహించారు. అందుకను గుణంగా వారు దోపిడీవ్యవస్థకు వ్యతిరేకంగా నిర్ణయాత్మకమైన పోరాటం సాగించేందుకు కార్మికవర్గాన్ని సమీకరించారు. ఆ వ్యవస్థకు చెందిన కోట గోడలను కూల్చివేసేందుకు పోరాటం నడిపారు; చివరకు సంపూర్ణ విజయం సాధించారు.

తమ సువిశాలదేశంలో సోషలిజాన్ని నిర్మించడం సాధ్యమేనని సోవియట్ యూనియన్ లోని మార్క్సిస్టు — లెనినిస్టులు ముందుగానే గ్రహించారు; ఆ మహత్కార్యాన్ని సాధించేందుకు శ్రామికప్రజలందరినీ (Proletarians) సమీకరించారు; సోషలిజాన్ని జయప్రదంగా నిర్మించే కృషిలో వారికి నాయకత్వం వహించారు.

ఫాసిస్టు జర్మనీ రెండవ ప్రపంచయుద్ధాన్ని తీసుకురావచ్చునని సోవియట్‌యూనియన్, తదితర దేశాల మార్క్సిస్టు-లెనినిస్టులు ముందుగానే గ్రహించారు. ఈ ప్రమాదాన్ని గురించి అన్నిదేశాలనూ హెచ్చరించారు; జర్మనీ ఓడిపోక తప్పదని జోస్యం చెప్పారు. రెండవ ప్రపంచయుద్ధంలో ప్రధానంగా సోవియట్ ప్రజలూ రెడ్‌ఆర్మీ వీరోచితంగా పోరాడ్డంవల్లనే, జర్మన్ దురాక్రమణదారుల, వారిమిత్రుల బలగాలు వెనక్కు తరుమగొట్ట బడ్డాయి.

నూతన ప్రజాస్వామ్యదేశాల (New Democracies) లోని మార్క్సిస్టు - లెనినిస్టులు తమ దేశాల్లో పెట్టుబడిదార్ల పెత్తనాన్ని కూల ద్రోసి, కార్మికవర్గ నాయకత్వంక్రింద కష్టజీవుల రాజ్యాన్ని స్థాపించి, సముచితమైన సోషలిస్టు మార్పులను ప్రవేశపెట్టడం సుసాధ్యమనీ, చారిత్రక ఆవశ్యకత అనీ ముందుగానే గ్రహించారు. సమాజాభివృద్ధికి సత్వరమే యీచర్యలు తీసుకోవడం అవసరమని తెలుసుకొని, తమ ప్రజల్ని సోషలిస్టు

నిర్మాణమార్గంలో నడిపారు. ఈమార్గంలో వారప్పుడే గణనీయమైన విజయాలు సాధించారు.

కార్మికవర్గ నాయకత్వం క్రింద, కమ్యూనిస్టుపార్టీ నాయకత్వంక్రింద చైనా ప్రజారిపబ్లిక్ ఒకబ్రహ్మాండమైన శక్తిగా రూపొంది విదేశీ స్వదేశీ శత్రువుల్ని ఓడించి. బూర్జువా ప్రజాతంత్ర విప్లవానికి సంబంధించిన అనేక క్లిష్టసమస్యలను పరిష్కరించింది. ఒక సాహసోపేతమైన సోషలిస్టు నిర్మాణ పథకాన్ని ఆదేశం ప్రారంభించింది; దాన్ని అమలుజరపడానికి తన యావచ్ఛక్తినీ వినియోగిస్తోంది.

ఈ విధంగా, 20వ శతాబ్దపు పూర్వార్ధభాగంలో జరిగిన ప్రధాన పరిణామాలను బట్టి, కమ్యూనిస్టులు మార్క్సిస్టు సిద్ధాంతం సహాయంతో మొత్తంమీద సరిగానే సార్వత్రిక చారిత్రకగతిని ముందుగా కనిపెట్ట గలిగారని రుజువవుతోంది. చరిత్రను గురించిన మార్క్సిస్టు – లెనినిస్టు దృక్పథం ఆచరణలో పూర్తిగా రుజువయింది.

అయితే, మార్క్సిస్టు-లెనినిస్టు సిద్ధాంతం పిడివాదం కాదు; ఆచరణకు మార్గం చూపే సాధనం. జీవితంలాగే యిదికూడా ఒకేచోట నిలబడదు. చారిత్రక పరిస్థితులు మారినప్పుడల్లా. అభ్యుదయ శక్తులు జరిపే పోరాటంలో నూతన కర్తవ్యాలు ఆవిర్భవించినప్పుడల్లా యిది అభివృద్ధి చెందుతూ వుంటుంది; సుసంపన్నమవుతూ వుంటుంది. నిజమైన మార్క్సిజం-లెనినిజం ఎల్లప్పుడూ సజీవంగా, సృజనాత్మకంగా వుంటుంది. మార్క్సిజం–లెనినిజం సృజనాత్మకంగా అభివృద్ధి చెందడంలో సోవియట్ కమ్యూనిస్టుపార్టీ నూతన కార్యక్రమం ఎంతో దోహదం చేసింది. సోవియట్ కమ్యూనిస్టుపార్టీ, ఆ పార్టీని నడిపే లెనినిస్టు కేంద్రకమిటీ జరిపిన సమిష్టి సిద్ధాంత కృషి ఫలితమే అది.

మార్క్సిస్టు-లెనినిస్టు సిద్ధాంతం మన ముందున్న మార్గాన్ని తేజో

వంతం చేస్తుంది. అయితే, దాన్ని సరిగా అన్వయించడ మెలాగో మనం తెలుసుకోవాలి మార్క్సిజం-లెనినిజం లేకపోతే అభ్యుదయకాముకులు సైతం తమచుట్టూ ప్రపంచంలో జరిగే ఘటనల అర్థాన్ని సరిగాను, సంపూర్ణంగాను తెలుసుకోలేక చీకట్లో తడుముకోవలసి వస్తుంది.

విప్లవంలో అనుసరించవలసిన విధానం ఏ శాస్త్రీయ పునాది మీద ఆధారపడాలో మార్క్సిస్టు-లెనినిస్టు సిద్ధాంతం తెలియజేస్తుంది. స్వీయ అభీష్టాలమీద ఆధారపడి రాజకీయవిధానాన్ని రూపొందించే వ్యక్తి నిరర్థకమైన స్వాప్నికుడైనా కావాలి; చరిత్రచే వెనుకకు నెట్టివేయబడే ప్రమాదానికైనా లోనవాలి. ఎందుచేతంటే మానవుని అభీష్టాలు చారిత్రక నియమాల కనుగుణంగా లేకపోతే, చరిత్ర అతని అభీష్టాల ప్రకారం నడవదు. కనుకనే, లెనిన్ భౌతికపరిస్థితుల్నీ భౌతికపరిణామక్రమాన్నీ, విశ్వాత్మకంగా శాస్త్రీయదృష్టితో పరిశీలించాలని నొక్కిచెప్పాడు. పార్టీ తన రాజకీయ విధానాన్ని రూపొందించుకొనేందుకు, ఆ తర్వాత దాన్ని విప్లవచైతన్యంతో అమలు జరిపేటందుకు అట్టి పరిశీలన ప్రాతిపదికగా ఉండాలని తెలియజేశాడు. మార్క్స్ యిలా వ్రాశాడు :

> "పరిస్థితుల్ని మనం ఉన్నవి ఉన్నట్లుగా చూడాలి. అంటే మారే పరిస్థితుల కనుగుణంగా మనం విప్లవ లక్ష్యాన్ని సాధించాలి."*

మార్క్సిస్టు సిద్ధాంతం అన్ని జాతుల విప్లవ అనుభవంనుండి, విప్లవభావాలనుండి ఉద్భవించింది. పీడితప్రజలందరి విముక్తికై జరిగే మహాపోరాటంలో నాయకత్వం వహించవలసిన కార్మికవర్గ చారిత్రకపాత్రకు అది అనుగుణమైన సిద్ధాంతం. కార్మికవర్గానికి మార్క్సిజం ఎలా సిద్ధాంత ఆయుధమో, అలాగే మార్క్సిజానికి కార్మికవర్గం భౌతిక ఆయుధం.

---

* కారల్ మార్క్స్ : **Briefe an Kugelmann, Berlin, 1927, S. 27 - 28.**

అందుచేత, ప్రపంచాన్ని గురించి సరియైన జ్ఞానం సంపాదించగోరే శ్రామికప్రజలందరికీ, అభ్యుదయ కాముకులందరికీ, పాతపరిస్థితులకు లొంగిపోవడం కాకుండా కొత్తపరిస్థితుల్ని చైతన్యంతో రూపొందించగోరే వారందరికీ మార్క్సిజం - లెనినిజం అమూల్యమైన శక్తినిస్తుంది. ప్రపంచంలో అలాంటి స్త్రీ పురుషులు యిప్పటికే లక్షలసంఖ్యలో ఉన్నారు; వారి సంఖ్య నిరంతరం పెరుగుతోంది. అంతకంతకు అధికంగా సామాన్యప్రజలు కార్యరంగంలో ప్రవేశిస్తున్నారు. ఏఆశయమూ లేకుండా జీవించడం వారి కిష్టంలేదు. చారిత్రక పురోగతిలో వారు స్వయంగా, చైతన్యయుతంగా పాల్గొనగోరుతున్నారు. వారందరికీ మార్క్సిజం - లెనినిజం అమూల్యమైన సహాయం చేస్తూంది; సరియైన మార్గం చూపెడుతోంది. ముఖ్యంగా యువతరాలకిది చక్కగా వర్తిస్తుంది. జీవితానుభవం ప్రసాదించే రాజకీయ పరిణతిని అందరికంటె త్వరితంగా సంపాదించేందుకు మార్క్సిజం - లెనినిజం వారికి సహాయపడుతూంది. తత్ఫలితంగా వారు తమ యావచ్ఛక్తిని మానవ సేవలో వినియోగించడానికి, అంటే సరియైన మార్గంలో వినియోగించడానికి, ఉత్సుకత చూపుతున్నారు.

సమస్త శాస్త్రపరిశోధనల్లో- సామాజికశాస్త్రాల్లోనేకాదు, ప్రకృతి శాస్త్రాల్లోకూడ మార్క్సిజం లెనినిజమే నిజమైన దిక్సూచిగా ఉంది. ఎందుచేతంటే, ప్రపంచాన్నిగురించీ, దాని సార్వత్రిక నియమాలను గురించీ, అన్యోన్యసంబంధాలను గురించీ, గతిక్రమాన్ని గురించీ సరియైన జ్ఞానం సంపాదించిన నాడు, ప్రకృతిశాస్త్రజ్ఞుని సృజనాత్మక పరిశోధనలు చక్కని ఫలితాలిస్తాయి. అట్టి జ్ఞానాన్నిచ్చేదే మార్క్సిజం-లెనినిజం.

చాలమంది ప్రఖ్యాతశాస్త్రవేత్తలు తమ పరిశోధనల ద్వారా సంపాదించిన అనుభవాన్ని ఆధారంచేసుకొని, ప్రకృతిరహస్యాలను గురించి ఇంకా ఉన్నతమైన జ్ఞానం సంపాదించడానికీ, మరింతచక్కగా మానవసేవ చేయడానికీ ముందుకొస్తున్నారు. వారు మార్క్సిజాన్ని పూర్తిగా అంగీకరిం

చడమో, లేదా మార్క్సిస్టుసూత్రీకరణల్లో కొన్నిటిని అనుకోవి తలంపుగా అమల్లో పెట్టడమో చేస్తున్నారు. వాని పరిశోధనానుభవమే యిందుకు దారి తీస్తోంది.

కళ, సాహిత్య రంగాల్లో కృషిచేసేవారు కూడ మార్క్సిస్టు-లెనినిస్టు దృక్పథం సాయంతో ఉజ్వలమైన భవిష్యత్తును చూడగల్గుతున్నారు. వేర్వేరు కళారూపాల్లో, సాహిత్యరీతుల్లో వాస్తవికతను మరింత అందంగాను, శక్తివంతంగాను చిత్రించేందుకు మార్క్సిస్టు దృక్పథం దోహదమిస్తుంది; ఆ దిశలో వారు తమ సృజనాత్మక శక్తుల్ని ఉపయోగించేలా ప్రోద్బల మిస్తుంది. ఆధునిక రచయితలు, కళాకారులు స్పష్టమైన, అభ్యుదయ కరమైన ప్రపంచ దృక్పథం లేకుండా చేస్తున్న కృషి ఎంత పేలవంగా ఉంటో చూస్తున్నాం.

బూర్జువా సాహిత్యం అంతకంతకు అధికంగా నిరాశకు, నిస్పృహకు లొంగిపోతూంటే, అభ్యుదయ రచయితల కళాకారుల కృషి జీవితంపట్ల విశ్వాసాన్ని కలిగిస్తోంది. ఉజ్వలభవిష్యత్తును గురించిన నమ్మకం వారిని ఉత్సాహపరుస్తోంది. వారికృషికి ప్రోద్బలశక్తి యిదే. అంతేకాదు. అలాంటి భవిష్యత్తును నిర్మించుకోవలసిన ఆవశ్యకతను కూడ అది తెలియజేస్తోంది.

పాశ్చాత్య బూర్జువా సిద్ధాంతాలు మానవునిలోను, నాగరికతయొక్క భవిష్యత్తులోను విశ్వాసం చెడగొట్టి. తీవ్రమైన సంక్షోభంలో కొట్టుమిట్టాడు తూంటే, మార్క్సిస్టు - లెనినిస్టు దృక్పథం ఉన్నతమైన సాంఘిక లక్ష్యా లకై పనిచేయాలనే అభిలాషను రేకెత్తిస్తోంది.

మార్క్సిజం — లెనినిజంలో పరిణతి సంపాదించినవాడు కార్మికవర్గం సరియైన లక్ష్యంకొరకే పోరాడుతున్నదనీ, సోషలిజం ప్రపంచ వ్యాపితంగా విజయం సాధించి తీరుతుందనీ, చారిత్రకంగా యిది అనివార్యమనీ బోధపడుతుంది. మార్క్సిజం-లెనినిజం బలహీనులకు సైతం

బలం యిస్తుంది; దాన్నుంచే నిలకడగల రాజకీయ సిద్ధాంతం ఉత్పన్న మవుతుంది. సిద్ధాంతంపట్ల అది గాఢమైన, అప్రతిహతమైన విశ్వాసం కలుగజేస్తుంది; తత్ఫలితంగా ఎన్ని కఠిన పరీక్షలకైనా నిలబడగల శక్తి లభిస్తుంది.

ప్రపంచంలో అన్నిమూలలా లక్షలాది ప్రజలు ఈ అమూల్యమైన నిధినుంచి ఉన్నతమైన లక్ష్యాలను సమకూర్చుకొన్నారు; ఆ లక్ష్యాలను కార్యరూపంలో పెట్టడాని కవసరమైన శక్తిని కూడా దీన్నుంచే పొందారు.

ఈ రోజున అభ్యుదయకరమైన ప్రపంచదృక్పథం లేకుండా మానవ జీవితం సాధ్యమని తెలివిగల ఏ వ్యక్తిఅయినా చెప్పగలడా? ఇంతకంటె కూడా హీనమైన స్థితి మందబుద్ధుల్ని సంతృప్తి పరచే కుహనా సిద్ధాంతాల మీద ఆధారపడ్డం; అదే ప్రపంచదృక్పథమని భ్రమపడ్డాయీను.

ఇంతకంటె మార్క్సిస్టు–లెనినిస్టు మూలసూత్రాల్లో పూర్తి పరిణతి సంపాదించడానికి ప్రయత్నించడం, మానవజాతికి బద్ధ శత్రువులైన సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో సిద్ధాంత ఆధిక్యతను సంపాదించడం వేయిరెట్లు మంచిది.

మొదటి భాగం

గతితార్కిక భౌతికవాదం

(మార్క్సిస్టు - లెనినిస్టు ప్రపంచదృక్పథం యొక్క తాత్విక పునాదులు)

మొదటి అధ్యాయం

తాత్విక భౌతికవాదం

(Philosophical Materialism)

మార్క్సిజం—లెనినిజం అనే మహా సౌధానికి పునాది—నాశన మెరుగని పునాది—గతితార్కిక (Dialectical), చారిత్రక (Historical) భౌతికవాదం.

అభ్యుదయకర విజ్ఞానశాస్త్రం, సాంఘిక జీవితాచరణా సమాకూర్చే, సమాచారాన్ని యిది ఆధారం చేసుకొని, ప్రపంచాన్ని యథాతథంగా వీక్షిస్తుంది. అనేక శతాబ్దాల కాలంలో లభించిన శాస్త్రవిజ్ఞానం ఫలితమే మార్క్సిస్టు తాత్విక భౌతికవాదం.

1. అభివృద్ధి నిరోధకత్వంపై, అజ్ఞానంపై పోరాటంలో అభ్యుదయకర భౌతికవాదం సాధించిన పురోగతి

ప్రపంచంలో అభ్యుదయకర శాస్త్రజ్ఞులు, తత్వవేత్తలు అజ్ఞానాన్ని మూఢవిశ్వాసాలకూ వ్యతిరేకంగా, సిద్ధాంత రాజకీయ అభివృద్ధి నిరోధకత్వానికి వ్యతిరేకంగా నిర్విరామమైన పోరాటం సాగిస్తూ వచ్చారు. ఈ పోరాట చరిత్రే విజ్ఞానశాస్త్ర చరిత్ర. దోపిడీ మీద ఆధారపడే ప్రతి వర్గ సమాజంలోను అభ్యుదయకర శాస్త్రీయభావాలు వ్యాప్తిచెందడంవల్ల నష్టపడే శక్తులు-అభివృద్ధినిరోధకవర్గాలు- ఉండితీరుతాయి. గతంలో వాయి ప్రత్యక్షంగా విజ్ఞానశాస్త్రాన్ని వ్యతిరేకించారు; అభ్యుదయకర శాస్త్రజ్ఞుల్నీ తత్వవేత్తల్నీ హింసించారు. కొందరిని జైళ్ళలో నిర్బధించేవరకు, సజీవంగా వారిని దహనం చేసేవరకు యిది వెళ్ళింది. కొన్ని సందర్భాలల్లో వాయి శాస్త్ర పరిశోధనలను వక్రంగా చిత్రించి, తద్వారా వాటి అభ్యుదయకర పాత్రను భౌతికవాద లక్షణాన్ని రూపుమాప యత్నించారు.

ప్రాచీన గ్రీసులో ఎనక్సాగొరస్ అనే భౌతికవాది నాస్తికుడనే కారణం చేత ఏథెన్స్ నుంచి వెళ్ళగొట్టబడ్డాడు. డెమాక్రటస్ అనే భౌతిక వాది పదార్థానికంతకూ మూలం పరమాణువులు (Atoms) అనే సిద్ధాంతం కనిపెట్టాడు; పకృతిలోగాని. మానవ వ్యవహారాల్లోగాని భగవంతుని ప్రమేయంలేదని నిరూపించాడు. ఆయన రచనలు అనేక శతాబ్దాల కాలంలో సర్వనాశనం చేయబడ్డాయి. తత్ఫలితంగా, ఆయన వ్రాసిన ఒక్క గ్రంథం కూడా మనం చదవడానికి నోచుకోలేదు.

ఎపిక్యురస్ అను ప్రాచీన గ్రీక్ భౌతికవాది డెమాక్రటస్‌కి శిష్యుడు. ఆయన మానవుణ్ణి దైవభీతినుండి విముక్తి చేసినందుకు, విజ్ఞానశాస్త్రమే ప్రమాణమని నిరూపించినందుకు ప్రాచీన గ్రీకు లాయనెంతో గౌరవించారు.

కాని మతాధికారులు ఆయనను నీతిబాహ్యుడని, మహాపాపి అని నిర్ధారణ చేసి, రెండువేల సంవత్సరాలపాటు ఆయన రచనలను నిషేధించారు.

రోమ్‌లో క్రైస్తవమతం రాజమతంగా చేయబడ్డ తర్వాత, ప్రాచీన నాగరికతకు సంబంధించిన స్మారక చిహ్నాలను మతాధికారులు, పీఠాధిపతులు నిర్దాక్షిణ్యంగా నిర్మూలించారు. ముఖ్యంగా 391 లో క్రైస్తవ పాషండుల ముఠా సెరాపిస్‌లోని ప్రాచీన దేవాలయాన్ని ధ్వంసమొనర్చారు. ప్రాచీన ప్రపంచంలో అత్యున్నతమైన అలెగ్జాండ్రియా పుస్తక భాండాగారంలో మిగిలివున్న గ్రంథాలన్నిటినీ తగులబెట్టారు. పోప్ గ్రిగరీ I (590-604) పౌరవిజ్ఞానానికి, పౌరవిద్యకు బద్ధశత్రువు. అతడు ప్రాచీన విద్వాంసులు వ్రాసిన అనేక అమూల్య గ్రంథాలను, ముఖ్యంగా భౌతికవాదుల రచనలను నాశనం చేశాడు.[1]

కేథలిక్ మతాన్ని వ్యతిరేకించే వారిని అణచేటందుకు పోప్ పీఠాధిపతి 'ఇంక్విజిషన్' అనే పద్ధతిని ప్రవేశపెట్టాడు (కేథలిక్ మతానికి వ్యతిరేకంగా నేరాలు చేసిన వారిని విచారించి తీర్పుచెప్పే న్యాయాధీశుల సంఘం - అను) అభ్యుదయ భావుకులందరినీ అతడు అమానుషంగా చిత్రహింసలకు లోను చేశాడు. క్రీ. శ. 1600 సంవత్సరంలో గియోర్డానో బ్రూనో అను గొప్ప తాత్వికుడు, శాస్త్రవేత్త కొపెర్నికస్ సిద్ధాంతాన్ని (విశ్వానికి కేంద్రం భూమి కాదనీ స్థిరంగా ఉన్న సూర్యునిచుట్టూ భూమి, తదితర గ్రహాలు వృత్తాకార కక్ష్యలలో తిరుగుతున్నాయనీ చెప్పే సిద్ధాంతం) సమర్థించినందుకు సజీవంగా దహనం చేయబడ్డాడు. 1619 లో 'ఇంక్విజిషన్' తీర్పును పురస్కరించుకొని, లుసీలియో వనీని అను సుప్రసిద్ధ విద్వాంసుడు ఫ్రాన్స్‌లోని టులూజ్ పట్టణంలో హత్య చేయబడ్డాడు. అతని నాలుకను పీకి, శరీరాన్ని మంటలకాహుతి చేశారు. గెలీలియో అను ప్రఖ్యాత ఇటాలియన్ ఖగోళశాస్త్రజ్ఞునిచే కొపెర్నికస్ సిద్ధాంతాన్ని ఒదులుకొనేటట్లు 'ఇంక్విజిషన్' బలవంతం చేయజూచింది. ఫ్రెంచి వికసనోద్యమ మహాతాత్వికుడు వాల్టెయిర్

బాస్టెయిల్ కోటజైల్లో నిర్బంధింపబడ్డాడు. డిడిరో అను మరొక 18వ శతాబ్దపు ఫ్రెంచి భౌతికవాది కూడ జైలుకు పంపబడ్డాడు.

అభివృద్ధి నిరోధకులు విజ్ఞానశాస్త్రంపై జరిపిన పోరాటం ప్రాచీన యుగానికీ మధ్యయుగాలకూ మాత్రమే పరిమితం కాలేదు. పెట్టుబడిదారీ యుగంలో కూడ యీపోరాటం జరుగుతోంది. పెట్టుబడిదారీ వర్గం సాంకేతశాభివృద్ధికి సన్నిహితమైన ప్రకృతిశాస్త్రాలను (Natural Sciences) మాత్రమే - భౌతికశాస్త్రం రసాయనికశాస్త్రం గణితశాస్త్రం వగైరా - అభివృద్ధి చేయడంలో ఆసక్తి చూపుతుంది. కాని వాస్తవికతను సరిగా అర్థం చేసుకోడానికీ, ఆవాస్తవికత పట్ల జీవితకార్యాల్లో సరియైన దృష్టిని అలవరచుకోడానికీ తోడ్పడే శాస్త్రీయ ప్రపంచదృక్పథాన్ని - భౌతికవాదాన్ని -వ్యాప్తి చేయడంలో ఆవర్గం ఏమాత్రమూ ఆసక్తిచూపదు. అందుచేతనే శాస్త్ర పరిశోధనలనుండి భౌతికవాద నిర్ధారణలకు నాస్తికవాద నిర్ధారణలకు రాకుండా చేయడానికి బూర్జువా సిద్ధాంత వేత్తలు సకలప్రయత్నాలు చేస్తున్నారు. ఎందుచేతంటే, అలాంటి నిర్ధారణలు సహజంగా పెట్టుబడిదార్ల పెత్తనానికి ప్రమాదకరంగా పరిణమిస్తాయి.

మార్క్సిజం-లెనినిజం అన్నా, మార్క్సిస్టు-లెనినిస్టు తత్వశాస్త్రమైన గతితార్కిక, చారిత్రక భౌతికవాదమన్నా అభివృద్ధినిరోధక బూర్జువావర్గానికి పరమద్వేషం. అనేకమంది బూర్జువా ప్రొఫెసర్లు ఒక సైన్యం మాదిరిగా మార్క్సిజాన్ని "ఖండించడం"లో ప్రత్యేకకృషి చేస్తున్నారు.

ఆధునిక యుగంలో అభివృద్ధినిరోధక బూర్జువావర్గం అభ్యుదయకర శాస్త్రజ్ఞుల్నీ, తత్వవేత్తల్నీ సజీవంగా దహనంచేయడం లేదు - నిజమే. కాని, యితర మార్గాల ద్వారా వారి మీద ఒత్తిడి తీసుకురావడం కనిపిస్తూనే వుంది. ఉదాహరణకు అట్టివారిని విశ్వవిద్యాలయాలనుంచీ, శాస్త్రపరిశోధక సంస్థలనుంచీ బర్తరఫు చేస్తున్నారు. వారు తమ గ్రంథాలను ప్రచురించుకోడానికి అవకాశాలు లేకుండా చేస్తున్నారు. నైతికంగాను, రాజకీయంగాను

వారి ప్రతిష్ఠకు భంగం కలిగిస్తున్నారు. ఇటీవలి సంవత్సరాల్లో "ప్రమాదకర మైన అభిప్రాయాలను" ప్రతిఘటించే పేరుతో యీ పద్ధతులన్నీ అమెరికా తదితర దేశాల్లో విస్తృతంగా అవలంబించబడ్డాయి. ఇలాంటి పద్ధతుల ద్వారాను, అభివృద్ధినిరోధక సిద్ధాంతాలను వ్యాప్తిలోకి తేవడంద్వారాను పాలకవర్గం ప్రజల మనసుల్ని తన కనుకూలంగా "నచ్చుకొంటూంది"; ఏ అభిప్రాయాలను ప్రజలంగీకరించాలని తాను అనుకొంటుందో, ఆ అభి ప్రాయాలను వారిలో చొప్పిస్తూంది; అభ్యుదయకరభావాల, భౌతికవాద భావాల వ్యాప్తిని నిరోధిస్తూంది.

అయితే శాస్త్రీయమార్గం, భౌతికవాద పంథా ఎంత కంటకావృత మైనప్పటికీ, దోపిడీ సమాజంలో ఎన్ని అగ్నిపరీక్షల నవి ఎదుర్కోవలసి వచ్చినప్పటికీ, చివరకు సకల ఆటంకాలను అవి అధిగమిస్తాయి; విజయం తర్వాత విజయం సాధిస్తూ పురోగమిస్తాయి.

అభ్యుదయకర భౌతికవాదమనే విజ్ఞానశాస్త్రం భౌతికవాద తత్వ శాస్త్రం ప్రకృతి నియమాలనూ, (Natural laws), సామాజిక నియమా లనూ (Social laws) తెలియజేస్తుంది; వాటిని మానవ శ్రేయస్సుకై యెలా ఉపయోగించుకోవచ్చో బోధిస్తుంది; నిజమైన జ్ఞానదీపికతో అజ్ఞా నాంధకారా న్నెలా పటాపంచలు చేయవచ్చో విశదపరుస్తుంది.

2. భౌతికవాదం, భావవాదం

తత్వశాస్త్రం ప్రపంచ దృక్పథానికి సంబంధించిన అత్యంత సాధారణ మైన లక్షణాలను వివరిస్తుంది.

భౌతికవాదానికి (Materialism) మూలాధారం, ప్రకృతి నిజంగా ఉన్నదనే విషయాన్ని గుర్తించడం. మనకు కనిపించే నక్షత్రాలు, సూర్యుడు, భూమి, భూమిమీద పర్వతాలు, లోయలు, సముద్రాలు, అరణ్యాలు, జంతువులు, ఆలోచించగల మానవులు—యివన్నీ ఉన్నాయని

గుర్తించడమన్నమాట. ప్రపంచంలో లోకాతీతశక్తులు లేవు; ఉండడానికి వీల్లేదు కూడా. అనంతమైన ప్రకృతిరూపాల్లో మానవుడొక రేణువు వంటి వాడు. చైతన్యమనేది (Consciousness) మానవుని ప్రత్యేకలక్షణం; ప్రత్యేకశక్తి. ప్రకృతి భౌతికమైనట్టిది. అంటే, మానవుని మనస్సుకు బయట, దానిమీద ఆధారపడకుండా, స్వతంత్రంగా అది వుంటుంది.

దీన్ని కొందరు తత్వవేత్త లంగీకరించరు. మనస్సుమాత్రమే, అనగా ఆలోచన మాత్రమే, ఆత్మ మాత్రమే, భావంమాత్రమే ప్రధానమనీ, భౌతికప్రపంచం ఆత్మనుంచి జనించి ఆత్మమీద ఆధారపడి వుంటుందనీ వీరంటారు. మానవుని మనస్సుకూ భౌతికప్రపంచానికీ గల సంబంధం ఏమిటనేది తాత్వికధోరణులన్నిటిలోను ప్రధానసమస్యగా ఉంది. అత్యంత నవీనమైన ధోరణుల్లో కూడ యిదే ప్రధానసమస్య. అస్తిత్వమా (Being) ఆలోచనా (thinking)? పదార్థమా (matter) మనస్సా? (mind) ఏది ప్రధానం? అనే ప్రశ్న తత్వవేత్తల్ని మొదటినుంచీ ఎదుర్కొంటూనే ఉంది. ఈ ప్రశ్నకుచెప్పే సమాధానాన్ని బట్టి తత్వవేత్తలందరినీ రెండు తరగతులుగా విభజించవచ్చు.

భౌతికపునాది - అంటే ప్రకృతి - ప్రధానమనీ. ఆలోచన - అంటే ఆత్మ - పదార్థధర్మమనీ భావించేవారు *భౌతికవాదానికి* చెందుతారు అలా కాక, ప్రకృతికి ముందే ఆలోచన లేదాఆత్మ లేదాభావం ఉందనీ, ప్రకృతి ఏదోఒక విధంగా ఆత్మనుంచి పుట్టి ఆత్మమీద ఆధారపడుతుందనీ వాదించేవారు *భావవాదానికి* చెందుతారు. "భావవాద"మనేమాటకూ "భౌతికవాద" మనే మాటకూ తాత్వికార్థం యిదే.

అతి ప్రాచీనకాలంనుంచీ భౌతికవాదులకూ భావవాదులకూ మధ్య భీకరమైన నిర్విరామ పోరాటం జరుగుతూ వచ్చింది. నిజం చెప్పాలంటే, మొత్తం తత్వశాస్త్రచరిత్ర అంతా యీరెండు ధోరణుల మధ్య. రెండు

పక్షాల మధ్య - భౌతికవాదం, భావవాదం - జరుగుతూవచ్చిన పోరాట చరిత్ర తప్ప మరొకటి కాదు.

యాదృచ్ఛిక భౌతికవాదం

ప్రపంచంలోని సమస్త వస్తువులు, ప్రకృతి పరిణామాలు స్వతంత్రంగా తమ ఆలోచనలతో నిమిత్తంలేకుండా జరుగుతున్నాయనే విషయాన్ని మానవులు తమ జీవితకార్యాల్లో శంకించరు. అంటే యాదృచ్ఛికంగా వారు భౌతికవాద దృక్పథాన్ని అవలంబిస్తున్నారన్నమాట.

లెనిన్ యిలా వ్రాశాడు :

> "పిచ్చాసుపత్రిలో ఉండని ఆరోగ్యవంతులు భావవాదులకు శుశ్రూషచేయని నిష్కపటులు కొందరున్నారు. వారు సమస్త పదార్థాలూ, పరిసరాలూ, యావత్ ప్రపంచం మన ఇంద్రియానుభూతులతో (Sensations) నిమిత్తం లేకుండా, మన చైతన్యంతో, మనతో, స్థూలంగా మానవునితో నిమిత్తం లేకుండా, *స్వతంత్రంగా* వ్యవహరిస్తున్నట్లే పరిగణిస్తారు ; అలాగే భావిస్తారు." ఇదే యాదృచ్ఛిక భౌతికవాద మంటే. * (Spontaneous Materialism)

మానవుడు భావాల (Ideas) మీదనే, భావనల (Concepts) మీదనే బ్రతకలేడు ; ఊహలనుంచి ఉద్భవించే ఇంద్రియానుభూతుల పైనే ఆధారపడలేడు. అనుభవంలో యిది అందరికీ చక్కగా తెలుసు. సమస్త పదార్థాలకు మూలం ఇంద్రియానుభూతులు. భావాలు, భావనలు అనే సిద్ధాంతాన్ని సృష్టించిన భావవాదులకు కూడా యిది తెలుసు. వారు అనేకసార్లు తామే తమ తత్వశాస్త్రానికి విరుద్ధంగా నడుస్తున్నామనీ, భౌతికపదార్థాలు లేకపోతే జనం ఆకలివల్ల చస్తారనీ అంగీకరించిన ఘటనలున్నాయి.

---

* లెనిన్ : 'భౌతికవాదమూ అనుభవవాద ఖండన' (Materialism and Empirios criticism) ' మాస్కో. 1952. పేజీ 269.

ప్రకృతిశాస్త్రజ్ఞుల్లో అత్యధిక సంఖ్యాకులు యిట్టి యాదృచ్ఛిక భౌతిక వాదులే. సర్వసాధారణంగా వారు తాత్విక సమస్యలను లోతుకు పోయి పరీక్షించరు. ఐతే ఏ శాస్త్రీయ వాస్తవాలపై వారు పరిశీలనలు జరపవలసి యుందో, వాటి హేతుబద్ధతను యాదృచ్ఛికంగా స్వీకరిస్తారు. వారు జరిపే పరిశోధనలు ప్రకృతిమీద. ఆ ప్రకృతి అడుగడుగునా శాస్త్రజ్ఞులు పరిశోధించే పరిణామాల (Phenomena) భౌతికత్వాన్ని నిరూపిస్తూ ఉంటుంది. ఎందుచేతంటే, శాస్త్రజ్ఞులు గ్రహాలను గురించి పరిశోధనలు జరుపుతున్నా. అణువుల్ని (Molecules) గురించి లేదా పరమాణువుల్ని (Atoms) గురించి[2] పరిశోధనలు జరుపుతున్నా, విద్యుచ్ఛక్తిని గురించీ అయస్కాంత శక్తిని గురించీ పరిశోధనలు జరుపుతున్నా వృక్షజాతుల్ని గురించీ జంతుజాలాన్ని గురించి పరిశోధనలు జరుపుతున్నా యెల్లప్పుడూ వారు భౌతిక పరిణామాలను గురించే, పదార్థాలు వాటి ధర్మాలనుగురించే, ప్రకృతి నియమాలను గురించే పరిశోధనలు జరుపుతూ ఉంటారు. ఇవన్నీ మానవుని ఆలోచనలతో నిమిత్తంలేని స్వతంత్రశక్తులు.

బూర్జువాసమాజంలో అతి సాహసవంతులైన, అతిదృఢమనస్కులైన శాస్త్రవేత్తలు మాత్రమే బహిరంగంగా తాము భౌతికవాదులమని ప్రకటించుకోగలరు. అధికసంఖ్యాకులైన శాస్త్రవేత్తలు అధికారంలోనున్న బూర్జువావర్గ సిద్ధాంతాల, మతసంస్థల, భావవాద ధోరణుల, తదితర పరిసర పరిస్థితుల ఒత్తిడికి లోనవుతూ ఉంటారు. ఆ ఒత్తిడి చాల ప్రబలమైనది; అందుచేత వారు బహిరంగంగా భౌతికవాదాన్ని స్వీకరించడానికి సాహసించరు; చంచలత్వం ప్రదర్శిస్తారు; తరచు వారు భావవాద ప్రకటనలు చేస్తారు; లేదా భావవాదాన్ని గురించి మనహాయింపులతో మాట్లాడతారు. అయితే, ఏ సమస్యలపై వారు పరిశోధనలు జరుపుతారో వాటి స్వభావాన్ని బట్టి, ప్రధానంగా వారు భౌతికవాద అభిప్రాయాలనే వ్యక్తం చేయవలసి వస్తుంది. ఇది వారి పరిశోధన కృషిలో అనివార్యమయిన విషయం.

ఉదాహరణకు, 19వ శతాబ్దపు ప్రకృతిశాస్త్రవేత్త (Naturalist) టి. హెచ్. హక్స్లీ విషయం చూదాం. ఆయన తాను భౌతికవాదినని చెప్పుకోలేదు. కాని జంతుశాస్త్రం, శరీరశాస్త్రం. మానుషశాస్త్రం (Anthropology), పరిణామశాస్త్రం (Evolution) వీటి అధ్యయనంలో భౌతికవాద అభిప్రాయాలను ప్రకటించాడు. భావవాదం గందరగోళానికీ, అజ్ఞానానికీ దారితీస్తుందని చెప్పాడు. ఇట్టి శాస్త్రవేత్తల్ని ఎంగెల్స్ "నర్మగర్భిత భౌతికవాదు ల"న్నాడు. హక్స్లీ భౌతికవాద వ్యతిరేక ప్రకటనల వెనుక యాదృచ్ఛిక భౌతికవాదం. ప్రకృతిశాస్త్ర భౌతికవాదం దాగియుందని లెనిన్ వ్రాశాడు.

తరచు ఆధునిక ప్రకృతి శాస్త్రజ్ఞులు తాత్వికంగా తమ శాస్త్రపరిశోధనలను విలువకట్టేందుకు చేసే ప్రయత్నంలో భావవాద నిర్ధారణలకు వస్తూఉంటారు. కాని వారు శాస్త్రపరిశోధనలకు కట్టుబడి యుండేంతకాలం, ప్రయోగశాలల్లోనో. ఫ్యాక్టరీల్లోనో వ్యవసాయ పరిశోధకక్షేత్రాల్లోనో పనిచేసేంతకాలం, తాము పరిశోధించే ప్రకృతి పరిణామాలమీద తమ దృష్టిని కేంద్రీకరిస్తూ తాత్వికసూత్రీకరణలవైపు పోకుండా ఉన్నంతకాలం - వారు యాదృచ్ఛిక భౌతికవాదులుగా వ్యవహరిస్తారు.

ఆధునిక భౌతికశాస్త్రజ్ఞుల్లో కీ. శే. ఆల్బర్టు ఐన్‌స్టీన్ అనన్యసామాన్యుడు. ఆయన ప్రకటించిన కొన్ని తాత్విక అభిప్రాయాల్లో భావవాదం యొక్క ప్రభావం కనిపిస్తుంది. కాని శాస్త్రీయరంగంలో ఆయన కనిపెట్టిన సాపేక్ష సిద్ధాంతం (Theory of relativity)[3] ప్రపంచ ప్రఖ్యాతి పొందింది. దాని మూలం, సారాంశం భౌతికవాదమే.

మాక్స్ ప్లాంక్ అను మరో ప్రఖ్యాత శాస్త్రవేత్త ఉన్నాడు. ఆయన ఆధునిక క్వాంటమ్ ఫిజిక్సును కనిపెట్టాడు.[4] ఆయనకూడా, తాను భౌతికవాదినని చెప్పుకోకపోయినా. ప్రకృతి అనేది మనస్సుతో నిమిత్తంలేని

స్వతంత్ర శక్తి అని గుర్తించాడు. ప్లాంక్ భావవాదాన్ని ఖండించాడు. ఆయనపేరుకు కాకపోయినా క్రియలో భౌతికవాదే.

కాని శాస్త్రవేత్తలు తమ వద్దనున్న శాస్త్రసమాచారాన్ని ఎలువకట్టే టప్పుడు భావవాదం తరచు అడ్డువస్తూ ఉంటుంది. దీన్నిబట్టి, యాదృచ్ఛిక భౌతికవాదం తగినంత శక్తివంతంగా భావవాదాన్ని ఎదుర్కోజాలదని గ్రహించవలసియుంటుంది. గతితార్కిక భౌతికవాదాన్ని చైతన్యయుతంగా స్వీకరించిన నాడే మనం భావవాదదోషాలనుండి ఖచ్చితంగా రక్షించుకో గలుగుతాం.

భౌతికవాదం : అభ్యుదయకర తత్వశాస్త్రం

తాత్విక భౌతికవాదం యాదృచ్ఛిక భౌతికవాదం వంటిది కాదు; సర్వగర్భిత భౌతికవాదం వంటిదికాదు. అభ్యుదయకరమైన శాస్త్రపరి శోధనలపైన, సాంఘికాచరణపైన అది ఆధారపడి, భౌతికవాద అభి ప్రాయాలను శాస్త్రీయంగా నిరూపిస్తుంది; విపులీకరిస్తుంది; ఖచ్చితంగా ఆచరణలో పెడుతుంది.

భావవాద అభివృద్ధినిరోధకత్వపు దుష్ప్రభావాన్నెదుర్కోడానికి భౌతికవాదం ఒక శక్తివంతమైన ఆయుధం. మొత్తం జీవితయాత్రకది మార్గం చూపుతుంది. ప్రజలమనసుల్ని కలవరపెట్టే అనేక తాత్వికసమ స్యలను సరిగా పరిష్కరించడమెలాగో అది చెబుతుంది.

క్రైస్తవమతం అనేక శతాబ్దాలుగా ఐహికజీవితం పట్ల విరక్తిని బోధిస్తోంది; దైవభీతిని నూరిపోస్తూంది. ప్రజలకు, ముఖ్యంగా పీడిత ప్రజలకు నిరంతరం పనిచేయడమూ, ప్రార్థనచేయడమే మోక్షమార్గమని బోధిస్తూంది. దుఃఖభాజనమైన యీప్రపంచంలో సౌఖ్యం ఆకాశకుసుమ మనీ, యీజన్మలో అందరూ విధేయులై వినమ్రులై ఉంటే వచ్చేజన్మలో

సౌఖ్యమనుభవించ వచ్చుననీ ఉపదేశిస్తుంది. దైవనిర్మితమైన ప్రస్తుత సమాజంమీద తిరుగబడేవారిని భగవంతుడు శిక్షిస్తాడని బెదిరిస్తుంది; వారు నరకంలో అనుభవించవలసిన బాధలను వర్ణిస్తుంది.[5]

భౌతికవాదం మానవుడు మూఢనమ్మకాలనుంచి విముక్తుడయేందుకు సహాయపడింది; ఆ విధంగా చరిత్రలో అద్భుతమైన పాత్ర వహించింది. చావంటే గాని దేవుళ్ళంటే గాని లోకాతీతశక్తులంటే గాని భయపడవద్దని ప్రాచీనకాలంనుంచీ బోధిస్తూవచ్చింది.

మరణానంతరం సౌఖ్యాలనుభవిస్తామనుకోడం భ్రమ అని భౌతిక వాదం చెబుతుంది. బ్రతికున్నప్పుడే జీవితానికి విలువ యివ్వాలనీ, మరింతగా దాన్ని చక్కబరచుకోవాలనీ అంటుంది. భౌతికవాదం మొట్టమొదటి సారిగా మానవుడు తనబౌన్నత్యాన్నీ బుద్ధికుశలతనూ గుర్తించగలిగేటట్లు చేసింది. మనిషి మట్టిలో పొర్లాడవలసిన కీటకం కాదనీ. ప్రకృతి సృష్టించిన అత్యున్నతమైన రూపమనీ భౌతికవాదం నిరూపిస్తుంది. మానవుడు ప్రకృతి శక్తుల్ని స్వాధీనంచేసుకొని తనకవి సహాయపడేటట్లు చేసుకోవచ్చునని రుజువుచేస్తుంది. మానవుని బుద్ధికుశలతలో, జ్ఞానసంపన్నతలో అనంతమైన విశ్వాసం దానికుంది. తనచుట్టూ ఉన్న ప్రపంచాన్ని గురించిన రహస్యాలను మానవుడు ఛేదించగలడనీ హేతుబద్ధమైన న్యాయసమ్మతమైన. సామాజిక వ్యవస్థను సృష్టించుకోగలడనీ భౌతికవాదం విశ్వసిస్తుంది.

తరచు భావవాదులు భౌతికవాదాన్ని గురించి చాలానిందలు ప్రచారం చేస్తారు. దాన్నొక "అమానుషమైన, దుర్మార్గమైన, భయంకరమైన జీవిత దృక్పథం"గా చిత్రిస్తారు (విలియంజేమ్స్ మాటలివి). నిజం చెప్పాలంటే, నిరాశావాదాన్ని బోధించేది భావవాదం; ముఖ్యంగా తర్వాతరోజుల్లో వ్యాప్తిచెందిన భావవాదధోరణులన్నీ యీ కోవకు చెందినవే. మానవుడు జ్ఞానమార్జించలేడనీ, విజ్ఞానశాస్త్రం నమ్మడానికి వీల్లేనిదనీ చెప్పేది భావవాదం; భౌతికవాదం కాదు. మృత్యుసిద్ధాంతాన్ని కొనియాడేది భావవాదం; భౌతిక

వాదంకాదు. అతి జుగుప్సాకరమైన అమానుష ప్రవృత్తులన్నీ, జాత్యహంకారం, ఫాసిస్టు పైశాచికత్వం లాంటివి - మొదటినుంచీ భావవాదంనుంచే ఉత్పన్నమయాయి.

భావవాదం భౌతిక ప్రపంచపు వాస్తవికతను నిరాకరిస్తుంది; తిరస్కరిస్తుంది. వేరొక ప్రపంచాన్ని - ఆధ్యాత్మిక ప్రపంచాన్ని - ఊహించి, అదే వాస్తవ ప్రపంచమని చెబుతుంది.

భౌతికవాదం అలాకాక, ప్రపంచాన్ని గురించిన వాస్తవ చిత్రాన్ని మన ముందుంచుతుంది. ఆత్మ, పరమాత్మ, సృష్టికర్త మొదలైన చేర్పులతో దాన్ని అపభ్రంశం చేయదు. భౌతికవాదులు, లోకాతీతశక్తుల సాయాన్ని కోరరు. మానవునిలో వారు విశ్వాసముంచుతారు; మానవుడు స్వశక్తితో ప్రపంచాన్ని మార్చగలడనీ, తన ఔన్నత్యానికి తగ్గట్లు దాన్ని రూపొందించుకోగలడనీ నమ్ముతారు.

భౌతికవాదం వస్తుతః జీవితంపట్ల విశ్వాసాన్ని బోధిస్తుంది; జీవిత పురోగతిని కాంక్షిస్తుంది; జీవితాన్ని ఉద్దీపింప జేస్తుంది. ఇదే దాని మూలస్వభావం. నిరాశకు, నిస్పృహకు అది వ్యతిరేకం. మానవజన్మ దుఃఖభాజనమనే సిద్ధాంతాన్ని అది అంగీకరించదు. కనుకనే సాధారణంగా అభ్యుదయకర గ్రూపులు, వర్గాలు భౌతికవాదమే సరియైన ప్రపంచ దృక్పథమని గుర్తిస్తున్నాయి. భౌతికవాదులు నిర్భయంగా ముందు వైపుకు చూస్తారు. తమ సిద్ధాంతం న్యాయసమ్మతం కాదేమోనన్న సందేహం వారికి లేదు.

భావవాదు లెప్పుడూ భౌతికవాదులపై అపనిందలు వ్యాప్తిచేస్తూనే వచ్చారు. భౌతికవాదులకు నైతికవిలువలు లేవనీ, ఉన్నతలక్ష్యాలు మృగ్యమనీ, ఇవి తమ గుత్తసొమ్ము అనీ వారంటారు.[6] నిజం చెప్పాలంటే, మార్క్స్-ఎంగెల్స్‌ల గతితార్కిక, చారిత్రక భౌతికవాదం అభ్యుదయకర

భావాలను నిరాకరించదు; నైతికసూత్రాలను, ఉన్నతలక్ష్యాలను తిరస్కరించదు; పైగా వాటికి గొప్ప ప్రాముఖ్యమిస్తుంది. ప్రజల్ని అనేకపోరాటాల్లో, సృజనాత్మకకృషిలో ఉత్సాహ పరచేందుకు ఉన్నతలక్ష్యాలే లేకపోతే, అభ్యుదయకరమైన సామాజికవ్యవస్థను నిర్మించడం అసంభవమని భౌతికవాదుల అభిప్రాయం.

కార్మికవర్గం కమ్యూనిస్టులు సాగిస్తున్న పోరాటం చూస్తే, భౌతికవాదులు ఉన్నత లక్ష్యాలపట్ల శ్రద్ధచూపరనే ఆరోపణ నిరాధారమైనదనీ, పచ్చిఅబద్ధమనీ బోధపడుతుంది. ఎందుచేతనంటే, యీపోరాటం ఒక మహోన్నతమైన, మహోత్కృష్టమైన లక్ష్యంకొరకు – కమ్యూనిజం కొరకు – సాగుతోంది. ఆలక్ష్యం పట్ల అత్యంత శ్రద్ధాసక్తులు గల సాహసవంతులు యీపోరాటంలో అసంఖ్యాకంగా తయారవుతున్నారు.

గతితార్కిక, చారిత్రక భౌతికవాదం: తత్వశాస్త్ర పురోగతిలో అత్యున్నతదశ

మార్క్స్, ఎంగెల్స్‌లు కనిపెట్టిన *గతితార్కిక, చారిత్రక భౌతిక* వాదమే ఆధునిక భౌతికవాదం. ఇది అకస్మాత్తుగా గాలిలోనుంచి పుట్టలేదు. ఎంతోకాలంగా అభివృద్ధి చెందుతూవచ్చిన తాత్వికభావాల అత్యున్నత దశయే మార్క్స్ – ఎంగెల్స్‌ల తత్వశాస్త్రం.

భౌతికవాదం 2500 సంవత్సరాలక్రిందట చైనా, ఇండియా, గ్రీసు దేశాల్లో ఉద్భవించింది.[7] ఈదేశాల్లో భౌతికవాద చింతన ప్రజల దైనందిన జీవితానుభవంతో దగ్గరసంబంధం కలిగియుండేది. ఆనాటి ప్రజలకు ప్రకృతిని గురించిన ప్రాథమిక పరిజ్ఞానం మాత్రమే ఉండేది. శాస్త్రవిజ్ఞానం యింకా అప్పుడప్పుడే రూపొందుతూంది. ప్రాచీనభౌతికవాదులు ప్రపంచాన్ని గురించి అనేక అద్భుతమైన విషయాలను ఊహించగలిగారు; కాని వాటికి

బలమైన శాస్త్రీయపునాది లేదు. అందుచేత అవి చాల ప్రాథమిక స్వభావం గలవి.

17, 18 శతాబ్దాల భౌతికవాదం అంతకంటె చాల పరిణతి చెందింది. ఎందుచేతంటే, ప్రకృతిశాస్త్రాల్లోను, సాంకేతికాభివృద్ధిలోను లభించిన విజయాలు ఆనాటి తాత్వికచింతనకు ప్రోద్బలమిచ్చాయి. అదే సమయంలో, భౌతికవాదం ప్రకృతి పరిశోధనలకు ప్రోత్సాహ మిచ్చింది. ఉదాహరణకు 17 వ శతాబ్దపు ఇంగ్లీషు భౌతికవాది ఫ్రాన్సిస్ బేకన్, జ్ఞానానికి ఆధారం ప్రయోగం (Experiment) అన్నాడు; జ్ఞానమంటే శక్తి అన్నాడు. ఆయన అభిప్రాయాలు ప్రకృతిశాస్త్రాల అభివృద్ధి కెంతో దోహదం చేశాయి.

ఈకాలంలో గణితశాస్త్రం, భూగోళశాస్త్రం, ఖగోళశాస్త్రం అద్భుతమైన విజయాలుసాధించాయి. వాటి ప్రభావం భౌతికవాదుల తాత్వికసూత్రాల్లో స్పష్టంగా కనిపిస్తుంది. ముఖ్యంగా పదార్థాన్ని గురించిన, చలనాన్ని గురించిన వారిదృక్పథంలో యీ ప్రభావం కనిపిస్తుంది. ఇలా నూతన రూపంలో భౌకతివాదం అభివృద్ధి చెందడంలో రెనీ డెకార్టే అను ఫ్రెంచి భౌతికవాది కనిపెట్టిన భౌతికశాస్త్ర సూత్రాలు, థామస్ హాబ్స్ అను ఇంగ్లీషు భౌతికవాది మానవుని పరిణామంగూర్చి కనిపెట్టిన యాంత్రిక సిద్ధాంతం. న్యూటన్ కనిపెట్టిన యాంత్రిక శాస్త్రం (Mechanics)[8] చాల ప్రధానమైన పాత్ర వహించాయి. ఆ రోజుల్లో భౌతికవాదులు ప్రకృతి పరిణామాలను (Natural phenomena), సామాజిక పరిణామాలను (Social phenomena) యాంత్రిక దృక్పథంతో పరిశీలించేవారు. యాంత్రికశాస్త్రం సహాయంతో వాటి ఆంతర్యాన్ని కనిపెట్టగలమనుకున్నారు. అందుచేతనే వారి భౌతికవాదం *యాంత్రికభౌతికవాద* మని (Mechanical Materialism) వ్యవహరింపబడేది. 18 వ శతాబ్దపు యాంత్రిక భౌతికవాదుల్లో ముఖ్యులు : ఇంగ్లండ్‌లో జాన్ టోలండ్, జోసెఫ్ ప్రీస్టిలీ; ఫ్రాన్స్‌లో

జూలియన్ లా మెట్రీ. పాల్ హోల్బాక్, క్లాడ్ ఏడ్రియన్ హెల్వీషియస్, డెనిస్ డిడిరో.

ఈ విధంగా 17. 18 శతాబ్దాలలో భౌతికవాదం ప్రకృతిశాస్త్రాలతో సన్నిహితసంబంధం ఉంచుకొంది. ఇదే దాని సుగుణం. అయితే కొన్ని లోపాలు కూడా ఉన్నాయి. ఎంగెల్స్ మూడు ప్రధానలోపాలను చూపెట్టాడు.

మొదటిది యాంత్రిక దృక్పథం. ఆరోజుల్లో యాంత్రికశాస్త్రం భౌతికవాదులకు ఆదర్శశాస్త్రంగా ఉండేది. ఇది వారి దృష్టిని సంకుచిత పరచింది. వారు సమస్త క్రమాలను (Processes) చలన (Motion) రూపాలను యాంత్రికచలనంగా కుదించడానికి (Reduce) ప్రయత్నించారు. అందుచేత వారు సజీవప్రకృతికి సంబంధించిన ప్రత్యేకతలను గాని, సమాజనియమాలను గాని అర్థం చేసుకోలేకపోయారు.

రెండవ బలహీనత ప్రకృతి పరిణామశీల మనేందుకు కాదనే సాక్ష్యాధారాలు వారి దృష్టికి వచ్చినప్పటికీ ఆ పరిణామరహస్యాన్ని వారు అర్థం చేసుకోలేదు ; అందుకు కారణాలను తెలుసుకోలేదు. ప్రకృతి అంతా ఏకఖండంగా వారికి తోచింది. అది ఎల్లప్పుడూ చక్రక్రమంలో పరిభ్రమిస్తుందనుకొన్నారు. మార్పుచెందే గుణం దానికి లేదనీ, అందుచేత అది మారదనీ వారి అభిప్రాయం. ప్రకృతిని గురించిన యీ దృక్పథం అధిభౌతిక (Metaphysical) దృక్పథమని వ్యవహరింపబడుతోంది. అందుచేత యాంత్రిక భౌతికవాదం అధిభౌతిక సిద్ధాంతం.

మూడవలోపం మార్క్స్‌కు ముందు జీవించిన భౌతికవాదులందరూ సామాజిక పరిణామాలను విశదీకరించడానికి భౌతికవాద సూత్రాల నెలా అన్వయించాలో తెలుసుకోలేకపోయారు. వాటి భౌతికపునాదిని గ్రహించలేకపోయారు. మానవసమాజం ఎల్లప్పుడూ క్రింది దశనుండి పైదశకు అభివృద్ధి చెందుతుందంటే అందుకు కారణం జ్ఞానం అభివృద్ధిచెందడ

మనీ, సాంప్రదాయిక భావాలు మారుతూండడమనీ వారి అభిప్రాయం. ఇది భావవాదధోరణి.

అంతేకాక, వాస్తవ ప్రపంచాన్ని మార్పుచేయడంలో, సమాజాన్ని పునర్నిర్మించడంలో వివిధవర్గాల, ప్రజల కార్యకలాపాలు విప్లవ చర్యలు ఎలాంటి పాత్ర వహిస్తాయో వీరికి తెలియదు. ఫ్యూడల్‌విధానం పోయి బూర్జువావ్యవస్థ రావాలని వీరు గట్టిగా చెప్పినప్పటికీ అందుకు మార్గం ప్రజలపోరాటమని తెలుసుకోలేదు. ప్రజల పోరాటమంటే వారు భయపడ్డారు. ఇది వారి వర్గపరిమితుల్ని—బూర్జువావర్గ పరిమితుల్ని—తెలియజేస్తుంది.

19 వ శతాబ్దపు తొలిభాగంలో లడ్విగ్ ఫ్యూర్‌బాక్ అను జర్మన్ తత్వవేత్తా, రష్యన్ విప్లవ ప్రజాతంత్రవాదులూ మహాక అడుగు ముందుకు వేశారు. రష్యన్ విప్లవ ప్రజాతంత్రవాదుల్లో ముఖ్యులు అలెగ్జాండర్ హెర్జెన్, విస్సేరియన్ బెలిన్‌స్కీ నికొలాయ్ చెర్నిషెవ్‌స్కీ, నికొలాయ్ డొబ్రోల్యుబోవ్‌లు. 18వ శతాబ్దపు భౌతికవాదులు అనుసరించిన యాంత్రిక దృక్పథాన్ని ఫ్యూర్‌బాక్ కొంతవరకు అధిగమించగలిగాడు. కాని వారి యితర బలహీనతలు ఈయనలో కూడ ఉన్నాయి. అంతేకాక, ఈయన తత్వశాస్త్రం సాంఘిక రాజకీయ కార్యకలాపాలతో సంబంధం లేనట్టిది. రష్యన్ భౌతికవాదులు అలాకాదు. వారు తమ భౌతికవాద అవగాహనను గతితర్కంతో జోడించారు. వారిగొప్పతనం అందులోనే ఉంది.

అంతేకాదు. రష్యన్ భౌతికవాదులు విప్లవ రైతాంగానికి సిద్ధాంతకర్తలు. అందుచేత వారు ప్రపంచాన్ని గురించి వివరించడంతోనే సంతృప్తి చెందలేదు. ప్రజల శ్రేయస్సుకై ప్రపంచాన్ని సంస్కరించడ మెలాగో, పునర్నిర్మించడమెలాగో కూడ వారు తెలియజేశారు.

మార్క్సు, ఎంగెల్సులు గతితార్కిక, చారిత్రక భౌతికవాదాన్ని కని

పెట్టడంతో, భౌతికవాదం ఒక నూతనదశకు, మహోన్నతదశకు చేరుకొంది. మార్క్స్, ఎంగెల్స్‌లు శ్రామికవర్గానికి గొప్ప నాయకులు, ద్రష్టలూను. ఈ వర్గం ఆధునికసమాజంలో అత్యంతప్రగతిశీల (Progressive) మైన, విప్లవకరమైన వర్గం. మార్క్స్, ఎంగెల్స్‌లు తత్వశాస్త్రంలో నిజంగా ఒక విప్లవాన్ని తీసుకొచ్చారు.

ఆనాటికి సమాజవిజ్ఞానశాస్త్రం, ప్రకృతిశాస్త్రం సాధించిన మహోన్నత విజయాలను వారు ఆకళింపుచేసుకొన్నారు; అంతకుముందు అభివృద్ధి చెందిన తాత్వికచింతనలో విలువగల అంశాలన్నిటినీ మథించి, వాటి అంతర్యాన్ని గ్రహించారు. ఆవిధంగా *గతితార్కిక, చారిత్రక భౌతికవాద* మనే కొత్త భౌతికవాద సంప్రదాయాన్ని వారు నిర్మించారు. అందులో యాంత్రికభౌతికవాదంలోని లోపాలేవీ లేవు.

మార్క్సిస్టు తత్వశాస్త్రంలో భౌతికవాదం. గతితర్కం ఒకదానితో ఒకటి ముడిపడి ఉంటాయి. వాటిమధ్య సజీవమైన ఐక్యత ఉంటుంది. మార్క్స్, ఎంగెల్స్‌లు గతితర్కాన్ని రూపొందించడంలో, సుసంపన్నమైన సమాజ విజ్ఞాన నిధులన్నిటినీ ఆకళింపు చేసుకోడంతో ప్రారంభించారు. జర్మన్ తత్వశాస్త్రం, ముఖ్యంగా హెగెల్ రూపొందించిన భావవాద గతితర్కం, సాధించిన విజయాలను వారు గ్రహించారు.

అంతేకాదు. మార్క్సిస్టు తత్వశాస్త్రానికి మూలాధారం నూతన శాస్త్ర పురోభివృద్ధి, ప్రకృతిశాస్త్రాల్లో నూతన పరిశోధనలూను. ముఖ్యంగా మార్క్సిస్టు తత్వశాస్త్రానికి పునాదులు. శక్తిమార్పిడి – శక్తినిత్యత్వ సూత్రం (Law of conservation and transformation of energy), జీవకణ సిద్ధాంతం (Cellular theory), డార్విన్ పరిణామవాదం (Theory of evolution.)9 ప్రకృతిశాస్త్రం సాధించిన విజయాలవల్ల, ప్రకృతి పరిణామాలకూ వాటి అన్యోన్య సంబంధాలకూ సంబంధించిన సిద్ధాంతం నిశ్చితమైన శాస్త్రీయపునాదిపై నిర్మింపబడింది.

ప్రకృతిని గురించిన మానవుని గురించిన పాక్షిక దృక్పథాన్ని, యాంత్రిక దృక్పథాన్ని విడిచిపెట్టి మార్క్స్, ఎంగెల్స్‌లు ఒక నూతన అభివృద్ధి నియమాన్ని కనిపెట్టారు. అది వాస్తవికజగత్తుకు సంబంధించిన సకల రంగాలకూ వర్తిస్తుంది; అదే సమయంలో ఒక్కొక్క రంగం యొక్క-నిర్జీవప్రకృతి సజీవప్రకృతి సామాజిక వ్యవస్థ మానవచైతన్యం-ప్రత్యేక ధర్మాలను అది దృష్టిలో ఉంచుకొంటుంది.

మార్క్స్ ఎంగెల్స్‌లు మొట్టమొదటిసారిగా సమాజజీవితాన్ని అర్థం చేసుకొనేందుకు భౌతికవాదాన్నొక సాధనంగా ఉపయోగించారు. సమాజాభివృద్ధికి కారణమైన భౌతిక చోదకశక్తుల్నీ (Motive forces) సామాజిక నియమాలనూ కనిపెట్టారు. ఆవిధంగా వారు మానవజాతి చరిత్రను ఒక శాస్త్రంగా అభివృద్ధిచేశారు.

అంతేకాదు. మార్క్స్ ఎంగెల్స్‌లు భౌతికవాదాన్ని భావనాత్మక (Abstract) సిద్ధాంతంగా ఉండే స్థితినుంచి ప్రపంచాన్ని మార్చే బలమైన సాధనంగా రూపొందించారు. సోషలిజం, కమ్యూనిజం స్థాపనకై కార్మిక వర్గం జరిపే పోరాటంలో ఒకగొప్ప సిద్ధాంతఆయుధంగా ఉపయోగపడేట్లు దాన్ని రూపొందించారు.

మార్క్స్ ఎంగెల్స్‌ల తాత్వికసిద్ధాంతం అన్నిదేశాల కష్టజీవులలో విస్తృతంగా వ్యాప్తిచెందింది. అదే ప్రజల సిసలైన తత్వశాస్త్రం.

3. *పదార్థాన్ని గురించిన తాత్వికభావన*

మార్క్సిస్టు భౌతికవాదంలో "పదార్థం" అనే మాట చాలా విస్తృతమైన అర్థంలో ఉపయోగింపబడుతుంది. భౌతికంగా - అంటే మనస్సుతో నిమిత్తంలేకుండా - మన ఇంద్రియానుభూతుల్లో ప్రతిబింబించే ప్రతిదీ పదార్థమే. "పదార్థమనగా మన ఇంద్రియానుభూతుల్లో ప్రతిబింబించే భౌతిక వాస్తవికత" అని లెనిన్ నిర్వచించాడు.

"పదార్థం" అనే మాటకు గల యీ విస్తృతార్థాన్ని తెలుసుకోడం చాలముఖ్యం. భౌతికవస్తువులలో ఉండే అణువులు, పరమాణువులు, సూక్ష్మకణాలు మాత్రమే పదార్థమని పూర్వపు భౌతికవాదులు అభిప్రాయపడేవారు. ఉదాహరణకు శూన్యంలో నిరంతరం కదులుతూ ఉండే పరమాణువుల సముదాయమే ప్రపంచమని డెమాక్రిటస్ ఎపిక్యూరస్‌లు భావించారు. పరమాణువుల సంయోగ వియోగాలవల్ల వస్తువులు వివిధ రూపాలు ధరిస్తాయని వారి అభిప్రాయం. అద్భుతమైన యీ ఊహను తర్వాత భౌతికశాస్త్రం ధృవపరచింది. అయితే పదార్థం పరమాణువులకు మాత్రమే పరిమితమైనదని భావించడం మరీ సంకుచితమైన ఆలోచన. అందుచేత భౌతిక ప్రపంచాన్ని గురించిన సమగ్రమైన అవగాహన యీ సిద్ధాంతంవల్ల ఏర్పడదు. అయినా, యీ సిద్ధాంతం 19వ శతాబ్దం చివర వరకు ప్రాచుర్యంలో ఉంది.

మార్క్సిస్టు భౌతికవాదం చెప్పేదాని ప్రకారం వివిధ రూపాల్లో సాక్షాత్కారమయే భౌతికవాస్తవికత కంతకూ "పదార్థం" అనేమాట వర్తిస్తుంది. పదార్థమంటే సమస్తవస్తువుల్లో ఉండే సూక్ష్మకణాలే కాదు. ఆద్యంత రహితమైన ఈ మహావిశ్వంలోని అనంతకోటి ప్రపంచాలూ పదార్థం క్రిందికే వస్తాయి. అంతరిక్షంలోని వాయుమేఘాలు (Gaseous clouds), ధూళిమేఘాలు (Dust clouds)[10] సౌరకుటుంబం (Solar system) లోని సూర్యుడు. సూర్యునిచుట్టూతిరిగే గ్రహాలు (Planets)[11] భూమండలంలోని భూమి దానిమీద ఉండే సమస్తజీవరాసులు, వస్తువులు యివన్నీ పదార్థంక్రిందికే వస్తాయి. రేడియేషను[12] కూడ పదార్థమే. ఒక వస్తువు యొక్క లేదా పరమాణువుయొక్క వ్యాపారాన్ని (Action) మరొక వస్తువుకు లేదా పరమాణువుకు బదలాయించి, వాటిమధ్య సంబంధాన్ని కల్పించే భౌతిక క్షేత్రాలూ (Physical fields)[13] ఎలక్ట్రోమాగ్నెటిక్, న్యూక్లియర్ గ్రావిటేషనల్ క్షేత్రాలూ కూడ పదార్థమే. మనస్సుతో

నిమిత్తం లేకుండా దానికి ఆవల ఉండే సమస్తమైన విషయాలూ పదార్థ సంబంధమైనట్టివే.

భౌతికవాస్తవికతను గురించి పరిశోధనలు జరిపే శాస్త్రాలన్నీ పదార్థాన్ని గురించి, దాని ధర్మాలను గురించి, దాని స్థితినిగురించే పరిశోధనలు జరుపుతూ వుంటాయి.

భౌతికశాస్త్రం పదార్థంయొక్క భౌతికస్థితుల్ని తెలియజేస్తుంది. పరమాణువు అతి క్లిష్టమైన నిర్మాణరూపమనీ,[1] ప్రాచీన అణుశాస్త్రజ్ఞులు భావించినట్లుగా అది విభజించ వీలులేని మార్పుకు లోనుగాని సాధారణ వస్తువేమీ కాదనీ ఆధునిక భౌతికశాస్త్రం నిరూపించింది. అంతేకాదు. ఒక మూలపదార్థానికి (Element) చెందిన పరమాణువులను మరొక మూల పదార్థానికి చెందిన పరమాణువులుగా మార్చవచ్చునని శాస్త్రజ్ఞులు రుజువు చేశారు.[15] ఉదాహరణకు యురేనియం పరమాణువుల్ని న్యూక్లియర్ రియాక్టర్‌లో ఉంచి, ప్లుటోనియం పరమాణువులుగా మార్చవచ్చు.

20 వ శతాబ్దపు తొలి సంవత్సరాల్లో కనిపెట్టబడిన నూతన భౌతిక శాస్త్ర విషయాలనుబట్టి (ఎక్స్‌రే, రేడియో యాక్టివిటీ వగైరా)[16] పరమాణువు ఛేదించ వీల్లేని పదార్థమనే పాతసిద్ధాంతం తప్పు అని రుజువైంది. తత్ఫలితంగా పదార్థనిర్మాణాన్ని గురించి కొత్తసిద్ధాంతాలు కనిపెట్టబడ్డాయి; సాంప్రదాయిక భౌతిక శాస్త్రానికి సంబంధించిన సిద్ధాంతాలు పటాపంచలయ్యాయి. అనేకమంది భావవాద తత్వవేత్తలూ, భౌతికశాస్త్రజ్ఞులూ భావవాదభ్రాంతులకు లోనై, విజ్ఞానశాస్త్రం భౌతికవాదాన్ని ఖండించిందంటూ ఒక నిర్ధారణ చేశారు. "పదార్థం అదృశ్యమైంద"ని వారు చెప్ప సాగారు. వారి అభిప్రాయాలు పూర్తిగా పొరపాటు. మార్క్సిస్టు భౌతికవాద మెన్నడూ పదార్థ నిర్మాణాన్ని గురించిన ఏ ఒక్క పాక్షిక సిద్ధాంతాన్నీ పట్టుకు వేళ్లాడదు; పదార్థమనే యిటుకలతో ప్రపంచం నిర్మింపబడిందనీ,

ఆ యిటుకలు మార్పుచెందవనీ మార్క్సిస్టు భౌతికవాదమెన్నడూ చెప్ప లేదు. మానవుని మనస్సుకు బయట ఉంటూ, దానిలో ప్రతిబింబించే భౌతిక వాస్తవికత యావత్తూ పదార్థమేనని మార్క్సిస్టు భౌతికవాదం చెబుతుంది. ఇది తప్ప మరో అర్థం ఆ మాటకు లేదు. జ్ఞానానికి మూలం ఏమిటనే సమస్యపైన, మానసికచైతన్యానికీ బాహ్యప్రపంచానికీ గల సంబంధమేమి టనే సమస్యపైగ భౌతికవాదదృక్పథం వేరూ, భావవాదదృక్పథం వేరూను: ప్రపంచం భౌతికంగా వాస్తవంగా ఉన్నదని భౌతికవాదం చెబుతుంది. దాని ప్రతిబింబమే చైతన్యం (Consciousness). పదార్థమంటే మొత్తం భౌతిక ప్రపంచాన్ని గురించి తెలియజేసే ఒక తాత్వికభావం. ఇక ప్రపంచం యొక్క భౌతిక నిర్మాణం భౌతిక ధర్మాల విషయ మాలో చిద్దాం. వీటిని భౌతికశాస్త్రం పరిశోధిస్తూ ఉంటుంది. విజ్ఞానశాస్త్రం అభి వృద్ధిచెందేకొద్దీ, పదార్థంయొక్క భౌతికనిర్మాణాన్ని గురించిన అభిప్రా యాలు కూడ మారుతూ ఉంటాయి. ఆ మార్పులు ఎంత పెద్దవైనప్పటికీ, భౌతిక ప్రపంచం వాస్తవంగా ఉన్నదనీ, భౌతికశాస్త్రం దాన్ని గురించి తెలియచేస్తుందనీ చెప్పే భౌతికవాద సూత్రం ఏ మాత్రమూ చెక్కు చెదరదు. లెనిన్ యీ విధంగా వ్రాశాడు :

> "పదార్థం యొక్క అస్తిత్వాన్ని తాత్విక భౌతికవాదం గుర్తిస్తుంది. దాని ప్రత్యేక లక్షణం భౌతిక వాస్తవికత; అంటే మన మనస్సుకు బయట ఉండడం"‡

పదార్థాన్ని గురించిన యీ అవగాహనే సరియైనది. ప్రపంచంయొక్క నానాత్వం (Diversity) అంతా యీనిర్వచనం క్రిందికి వస్తుంది. ఏ ఒక్క పదార్థరూపానికీ యిది పరిమితంకాదు. ఇట్టి మార్క్సిస్టు అవగాహనతో అవలోకించే వ్యక్తి భౌతికశాస్త్రంలో జరిగిన కొత్త కొత్త పరిశోధనలన్నీ

‡ లెనిన్ రచనలు: 14 వ సంపుటి, పుట 247 (Materialism and Empirio-criticism, Moscow 1952; పుట 63).

పదార్థం అదృశ్యమయిందనడానికి తార్కాణమంటూ వాదించే భావవాదుల వంచనకు లోనుకాకుండా ఉండగల్గుతారు.

పదార్థమనేది సృష్టించగలిగేదీ, విధ్వంసించ గలిగేదీ కాదు. అది నిరంతరం మార్పుచెందుతుంది. ఏఒక్క సూక్ష్మకణాన్నీ భౌతిక, రసాయనిక, తదితర ప్రక్రియల ద్వారా సమూలంగా నాశనంచేయలేం.

ఈ భౌతికవాదసూత్రాన్ని విజ్ఞానశాస్త్రం ధృవపరుస్తుంది. ఒక ఉదాహరణ తీసుకొందాం. కొన్నిప్రత్యేక పరిస్థితుల్లో పాజిట్రాన్, ఎలక్ట్రాన్‌ల వంటి సూక్ష్మకణాలు అదృశ్యమై ఫోటాన్లు అను తెజోఖండాలను సృష్టిస్తాయని ఆధునిక భౌతికశాస్త్రజ్ఞులు నిరూపించారు. కొందరు శాస్త్రజ్ఞులీపరిణామాన్ని "పదార్థ నిర్మూలన" మని పిలుస్తారు. పదార్థం అదృశ్యమయిందనడానికిది "తార్కాణ" మంటారు భావవాదులు. Annihilation అనే యింగ్లీషుమాట Ninil అను లాటిన్‌మాట నుంచి పుట్టింది. Nihil అంటే అర్థం నిర్మూలన; సర్వనాశనం; శూన్యంగామారడం. వాస్తవానికి ఏదీ అదృశ్యమవదు. పాజిట్రాన్లు, ఎలక్ట్రాన్లు ఫోటాన్లుగా మార్పుచెందుతున్నాయంటే, పదార్థం ఒకస్థితి State నుంచి మరోస్థితికి మారుతోందన్న మాట; ఘనపదార్థం కాంతిగా మారుతోందన్నమాట. అంతేకాదు. యిందుకు పూర్తివిరుద్ధంగా ఫోటాన్లు పాజిట్రాన్లుగాను, ఎలక్ట్రాన్లుగానుకూడ మారడం -అంటే కాంతి ఘన పదార్థంగాకూడ మారడం-ప్రకృతిలో మనం చూస్తాం. ఈ మార్పులన్నీ ద్రవ్యరాశి - శక్తి నిత్యత్వ సూత్రాన్ననుసరించి (Law of conservation of mass and energy) జరుగుతాయి.[17]

ప్రపంచం యావత్తూ నానాత్వంతో నిండియుంది: సజీవ ప్రకృతి, నిర్జీవప్రకృతి, భౌతికఘటనలు, రసాయనిక పరిణామాలు, వృక్షజాలం, జంతుజాలం సమాజవ్యవస్థ. ఈ నానాత్వంలో ఏకత్వం యిమిడి ఉన్నదని విజ్ఞానశాస్త్రం భౌతికవాదం నిరూపిస్తున్నాయి. అనంతమైన యీ భిన్న పరిణామాలు ఘటనలు పదార్థంయొక్క వేర్వేరు స్థితులు, ధర్మాలు, వ్యక్తీ

కరణలు మాత్రమే. ఎంగెల్స్ చెప్పినట్లు "ప్రపంచంయొక్క నిజమైన ఏకత్వం దాని భౌతికత్వంలో ఉంది."* అంతేకాదు. చైతన్యంకూడ భౌతిక ప్రపంచానికి సంబంధించినదే; దాని కతీతమైన మరో ప్రపంచానికి సంబంధించినది కాదు. చైతన్యమనేది ఒక ప్రత్యేక పద్ధతిలో నిర్మితమయిన పదార్థ ధర్మం.

ఇహలోకంవేరు, పరలోకంవేరు అనే మతసిద్ధాంతానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో భౌతికప్రపంచమంతా ఒక్కటనే నిర్ధారణ రూపు దాల్చి వృద్ధిచెందింది. శరీరం - ఆత్మ, పదార్థం - మనస్సు భిన్నమైనవనీ వాటి మధ్య ఎట్టిసంబంధంలేదనీ చెప్పే ద్వైధీభావానికి **(Dualism)** వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో యిది రూపొంది బలపడింది. ప్రపంచం మనస్సునుంచి, ఆత్మనుంచి ఉద్భవించిందనీ, అలా ఉద్భవించిన ప్రపంచమంతా ఒక్కటనీ చెప్పే భావవాదానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో యిది ఉత్పన్నమై పెంపొందింది.

4. భౌతిక ప్రపంచపు సార్వత్రిక అస్తిత్వ రూపాలు. ప్రకృతిలో నిరంతర చలనం

ప్రకృతిలోను, సమాజంలోను పూర్తి విశ్రాంతి అంటూ ఉండదు; పూర్తిచలన రాహిత్యం అసంభవం; పూర్తి జడత్వం అనూహ్యం. ప్రపంచం నిరంతరం చలిస్తూ ఉంటుంది; పరివర్తన చెందుతూ ఉంటుంది.

చలనం, మార్పు, అభివృద్ధి యివి పదార్థంయొక్క నిత్య ధర్మాలు; నిశ్చితలక్షణాలు. ఎంగెల్స్ యిలా వ్రాశాడు :

---

* ఎంగెల్స్ : Anti-Duhring మాస్కో-1959 ; పుట 65.

"చలనం, (Motion) అనేది పదార్థ అస్తిత్వ రూపం. ఇంతవరకు చలనంలేని పదార్థమంటూలేదు; ఉండబోదు కూడా."‡

ప్రతి భౌతికవస్తువు, ప్రతి సూక్ష్మకణం - అణువు, పరమాణువు, వాటి అంశీభూతములు (Components) - నిరంతరం చలనస్థితిలో, పరివర్తనస్థితిలో ఉంటాయి. ఇది వాటి స్వతస్సిద్ధలక్షణం.

తత్వశాస్త్రంలో చలనం అంటే వస్తువు ఒక ప్రదేశంనుంచి మరొక ప్రదేశానికి కదలడమే కాదు. పదార్థంయొక్క అస్తిత్వం చలనంలో ద్యోతకమవుతుంది. ప్రపంచంలో జరిగే మార్పులన్నీ పరిణామక్రమాలన్నీ (Processes) చలనంక్రిందికే వస్తాయి. ఈ మార్పులలో ప్రత్యేకప్రాముఖ్యం గలవి పదార్థంయొక్క పరిణామక్రమాలు; అంటే పదార్థం ఒక స్థితినుంచి మరోస్థితికి, ఉన్నతస్థితికి పరివర్తనచెందడం; నూతనధర్మాలను నూతన లక్షణాలను కలిగియుండే నూతనస్థితికి పరివర్తనచెందడం.

ప్రపంచంలో శాశ్వతమైన, స్థిరత్వంగల్గిన యథాతథమైన వస్తువు ఎక్కడా ఉండవు; మారుతున్న, పరివర్తనచెందుతున్న వస్తువులే ఉంటాయి. అనగా పూర్తివిశ్రాంతి ఎక్కడా ఉండదు; చలనరహితస్థితి అసంభవం; సాపేక్షమైన (Relative) విశ్రాంతి మాత్రమే సంభవం.[18] ఒకవస్తువు విశ్రాంతస్థితిలోఉన్నదంటే అర్థం భూమియొక్కసమతలంపై (Surface) ఒకానొకబిందువు (Point) వద్ద విశ్రాంతిస్థితిలో వుందన్నమాట. కాని ఆవస్తువు భూమితోపాటు, సౌరకుటుంబ మంతటితోపాటు పరిభ్రమిస్తూ ఉంటుంది. అంతేకాదు. దానిలోని అణువులు, పరమాణువులు కూడ పరిభ్రమిస్తూ ఉంటాయి. అంతేగాక ఈ అంశీభూతాలలో శ్లిష్టమైన (Complex) పరిణామక్రమాలు సంభవిస్తూంటాయి. క్లుప్తంగా చెప్పాలంటే, విశ్రాంతి సాపేక్షమైనది; చలనం మాత్రమే నిరపేక్షమైనది. దీనికి మినహాయింపు లంటూ ఉండవు.

‡ ఫ్రెడరిక్ ఎంగెల్స్: Anti - Duhring - మాస్కో, 1959; పుట 88.

పదార్థచలనం యొక్క రూపాలు

పదార్థ చలనం పదార్థ వైవిధ్యాని కనుగుణంగా, అనేక రూపాల్లో జరుగుతుంది. పదార్థ చలనం యొక్క అత్యంత సరళమైన (Simple) రూపం యాంత్రికచలనం. అంటే, ఒకవస్తువు ఒక స్థలంనుంచి మరో స్థలానికి కదలడం. అంతకంటె క్లిష్టమైనరూపం ఉష్ణమూన (Thermal) మార్పు[19]. అంటే భౌతికవస్తువుల్లోని పరమాణువులు అస్తవ్యస్తంగా చలించడం. కాంతి, విద్యుదయస్కాంత ప్రసారం (ఎలక్ట్రోమాగ్నెటిక్ రేడియేషను) 20, భౌతికక్షేత్రాలు—యివి పదార్థ చలనంయొక్క ప్రత్యేక స్థితులని విజ్ఞానశాస్త్రం నిరూపించింది. మరొక చలనరూపం, అణువుల్నీ పరమాణువుల్నీ సంయోగమొనర్చడం ద్వారా, వియోగమొనర్చడం ద్వారా రసాయనిక మార్పులు[21] తీసుకొచ్చి, పదార్థంలో పరివర్తన తీసుకురావడం. ప్రకృతిలో జీవరాసుల పుట్టుక, వృక్షాల్లోను జంతువుల్లోను కలిగే పరివర్తనలు జీవరాసుల పరిణామం—యివిమూడు పదార్థంయొక్క సార్వత్రిక ధర్మమైన చలనానికి నిర్దిష్టరూపాలే.

ఇంతకంటె చాలా క్లిష్టమైన చలనరూపం మానవసమాజంలో—అంటే భౌతికపదార్థాల ఉత్పత్తిక్రమం, ఆర్థికజీవితం మొదలైనవాటిలో—కనిపిస్తుంది.

19వ శతాబ్దాంతం తర్వాత శాస్త్రవేత్తలు అదివరకు తెలియని ఎన్నో పదార్థ చలనరూపాలను కనిపెట్టారు; ఎన్నో పరిశోధనలు జరిపి వాటిని నిరూపించారు. ఉదా: అణుగర్భం (న్యూక్లియస్) చుట్టూ ఎలక్ట్రాన్ల పరిభ్రమణం, పరమాణుగర్భంలో క్లిష్టమైన పరిణామక్రమాలు వగైరా. ముందు ముందు శాస్త్రవేత్తలు యింకా కొత్త కొత్త పదార్థ చలన రూపాలను కనిపెట్టగలరనడంలో సందేహం లేదు.

ఈ రూపాలన్నీ ఒకదానితో ఒకటి సంబంధం కలిగియున్నాయి; ఒక రూపం మరోరూపంలోకి మారుతూ ఉంటుంది. ఉదాహరణకు అణువుల

అవ్యక్త చలనం ఉష్ణమాన మార్పులకు దారితీస్తుంది. ఈ ఉష్ణమాన మార్పులు రసాయనిక మార్పులకు తేజోమార్పులకూ దారితీస్తాయి. రసాయనిక మార్పులు ఒకానొక దశలో మాంసకృత్తుల నిర్మాణానికీ వాటికి సంబంధించిన కిణ్వక్రియలకూ (పులియడం) దారితీస్తాయి. ఈ కిణ్వక్రియలే (Enzyme Systems) ప్రాణానికి మూలం. అంటే పదార్థచలనం ప్రాణంగా రూపొందడాని కిది మూలం అన్నమాట.

శక్తికూడా ఒకరూపం నుంచి మరోరూపానికి మారుతుందనీ, ఆవిధంగా శక్తి పరివర్తన చెందుతూ నిక్షిప్తమవుతూ ఉంటుందనీ చెప్పే సూత్రం ప్రకృతిశాస్త్రంలో చాల ప్రధానమైన సిద్ధాంతం. అదే శక్తినూర్పిడి-శక్తి నిత్యత్వ సూత్రం.

వివిధ చలనరూపాలు పదార్థ పరిణామంలో, పదార్థ నిర్మాణంలో వివిధ దశలకు చెందినవై వుంటాయి. నిమ్న (Lcwer) రూపాలు, సరళరూపాలు అంతకంటె ఉన్నతమైన (Higher) శ్లిష్టమైన రూపాల్లో భాగా లవుతాయి. అయినా, వాటన్నిటిమధ్య గుణాత్మకమైన (Qualitative) భేదం ఉంటుంది. ఉన్నత రూపాలను నిమ్నరూపాలుగా మార్చడం సాధ్యంకాదు. ఉదాహరణకు, శారీరక గతిక్రమాల్లో యాంత్రికచలనం ఒకభాగం. అంటే, ఈ శారీరక గతిక్రమాల్లో పాల్గొనే మూల పదార్థాలు ఒకస్థలం నుంచి మరొక స్థలానికి మారుతూ ఉంటాయి. కాని, అంతమాత్రంచేత, శారీరక పరిణామక్రమాలను మూల పదార్థాల యాంత్రికచలనంగా ఎన్నటికీ మార్చలేము.

మార్క్సుకు పూర్వం యాంత్రిక భౌతికవాదులు ప్రకృతిలోని, సమాజంలోని యావత్తు జీవితాన్నీ యాంత్రిక చలనంగా మార్చవచ్చు నను కొన్నారు. సూక్ష్మకణాలు వస్తువులు ఒకస్థలంనుంచి మరోస్థలానికి మారే విధంగా ప్రపంచఘటనల్ని మార్చవచ్చు ననుకొన్నారు. మార్క్సిస్టు భౌతిక వాదు లలాకాదు. చలనాన్ని వారు విశాలార్థంలో మార్పుఅని నిర్వచించారు.

పదార్థచలనం గురించిన సంకుచితమైన, అతి సరళమైన యాంత్రిక దృక్ప థాన్ని వారంగీకరించరు.

స్థలం, కాలం

పదార్థం స్థలం (Space), కాలాల్లో (Time) మాత్రమే చలించ గలదు. మానవునితో సహా సమస్త వస్తువులు, ప్రపంచంలో జరిగే సమస్త పరిణామాలు ఒక నిర్దిష్టప్రదేశాన్ని ఆశ్రయించి ఉంటాయి. ఒకదాని కొకటి దగ్గరగానో దూరంగానో ఉంటాయి. వాటన్నిటిమధ్య ఎంతోకొంత స్థలం ఉండితీరుతుంది. కదిలే ప్రతివస్తువూ ఒక నిర్దిష్టమార్గంలో కదులు తుంది. వీటన్నిటినిబట్టి భౌతిక వస్తువుల, భౌతిక పరిణామాల ధర్మం వ్యాకోచమని (Extension) బోధపడుతుంది.

స్థలం అనేది పదార్థ ల స్తిత్వాన్ని వ్యక్తంచేసే సార్వత్రికరూపం. స్థలంలో తప్ప పదార్థానికి ఉనికి లేదు; అలాగే, పదార్థం లేకుండా స్థలం లనేది ఉండదు. ఒక వస్తువుయొక్క వ్యాకోచానికీ భౌతికప్రపంచ మంతటి వ్యాకోచానికీ తేడా ఉంది. వస్తువుయొక్క వ్యాకోచం పరిమితమైనది. అంటే దానికొక మొదలు, తుది ఉంటాయి. కాని భౌతిక ప్రపంచం పరిమితులు లేనిది; ఆద్యంతరహిత మైనది.

భూమిమీద కంటె విశ్వాంతరాళంలో వస్తువుకూ వస్తువుకూ మధ్య దూరాలు చాలా హెచ్చు; వెంటికీ పోలికేలేదు. నక్షత్రాలనుంచి కాంతి భూమిమీదికి ప్రసరించడానికి లక్షల, కోట్ల సంవత్సరాలు పడుతుంది (సెకండుకు 1,86,000 మైళ్ళ చొప్పున కాంతి ప్రయాణం చేస్తుంది). అట్టి నక్షత్రాలను మనం ఆధునిక దూరదర్శినులతో పరిశీలించవచ్చు. ఈ దూరాలు కూడా ఆద్యంతాలు గలవే. కాబట్టి అనంతవిశ్వం యొక్క విస్తృతిని తెలుసుకోడానికివి చాలవు. ఆద్యంతరహితమైన యీ విశ్వం మన ఊహ

కందని విషయం:[22] దాన్నొక శాస్త్రీయభావంగా సూత్రమే వ్యక్తంచేయగలం.

భౌతికపదార్థాలు, మానవుడు సైతం, నిర్దిష్టమైన కాలంలోనే—నిమిషాలు, గంటలు, రోజులు—ఉండడం సాధ్యం. ప్రపంచంలో ప్రతీదీ మారుతుంది. ప్రతి వస్తువుకీ, ప్రతి ప్రకృతి పరిణామానికీ భూతకాలం, వర్తమాన కాలం, భవిష్యత్కాలం ఉంటాయి. ఇవి కాలాన్ని తెలియజేసే మాటలు. స్థలంవలెనే కాలంకూడ పదార్థ అస్తిత్వాన్ని వ్యక్తంచేసే సార్వత్రిక రూపం. ప్రతివస్తువూ, ప్రతి పరిణామం, యావత్ భౌతిక ప్రపంచం నిర్దిష్టమైన కాలంలోనే ఉంటాయి.

అయితే, యిక్కడ కూడ ప్రత్యేకవస్తువుల ఉనికిని తెలియజేసే కాలానికీ, మొత్తం ప్రకృతియొక్క ఉనికిని తెలియజేసే కాలానికీ వ్యత్యాసం ఉంది. ప్రత్యేక వస్తువుల ఉనికి కాలానికి కట్టుబడి వుంటుంది; ప్రకృతి అలాకాక సర్వకాలల్లోను ఉంటుంది; అంటే శాశ్వతమైనది. ప్రపంచంలో ప్రతీదీ ఉద్భవించి, మార్పుచెంది, నశిస్తుంది. ప్రకృతి అలాకాదు: దానికి ఆద్యంతాలు లేవు. ప్రత్యేక వస్తువులు తాత్కాలికంగా ఉంటాయి; అయినా పరస్పరసంబంధం గల యీ తాత్కాలిక వస్తువులన్నీ కలిసి శాశ్వత ప్రకృతి అవుతుంది; దానికి ఆద్యంతాలు లేవు.

భూమి పుట్టుకను గురించీ, భూమి మీద ప్రాణుల పెరుగుదలను గురించీ తెలియజేసే లెక్కలు మనలను ఆశ్చర్యచకితుల్ని చేస్తాయి. ఈనాడున్న ఆకృతిలో మానవుడు దాదాపు 50,000 లేదా 70,000 సంవత్సరాలనాడు అవతరించాడు. నరునిగా వానరుని పరివర్తన దాదాపు 10,00,000 సంవత్సరాలనాడు జరిగింది. వృక్షసంతతికీ, జంతుసంతతికీ చెందిన తొలి ప్రాణులు దాదాపు 100 కోట్ల సంవత్సరాల క్రిందట ఉద్భవించాయి. భూమి పుట్టి యిప్పటికి అనేక వందల కోట్ల సంవత్సరా లయింది. ఇంత దీర్ఘ

చరిత్ర దాని కుంది. అయితే ఈ అంకెలేవీ - ఇంకా పెద్ద అంకెలున్నా కూడ - ప్రకృతి యొక్క శాశ్వతత్వాన్ని సరిగా తెలియజేయవు. ఎందు చేతంటే, శాశ్వతత్వం ఆది మధ్యాంత రహితమైనకాలాన్ని తెలియజేస్తుంది. ప్రకృతి ఎల్లప్పుడూ ఉంది; ఉంటుంది. ఇదే శాశ్వతత్వమంటే.

భౌతిక ప్రపంచంయొక్క అస్తిత్వం అన్యోన్యసంబంధం గల స్థల, కాలాల్లో వ్యక్తమవుతుంది. చలనంగల పదార్థంనుంచి వాటిని వేరుచేయలేం.

ఈ విషయాన్ని ఐన్‌స్టీన్ సాపేక్ష సిద్ధాంతం ఎంతో సమర్థవంతంగా నిరూపించింది. ఆధునికయుగంలో కనిపెట్టబడిన అత్యద్భుతమైన శాస్త్రీయ సిద్ధాంతాల్లో ఇదొకటి. అదివరకు భౌతికశాస్త్రజ్ఞులు స్థలమూ, పదార్థం వేర్వేరని భావించేవారు. స్థలం అనేది ఎన్నడూ మార్పుచెందని శూన్యప్రదేశమనీ భౌతికపదార్థాలు ఏదో బాహ్యశక్తి ప్రేరణవల్ల ఆ శూన్యప్రదేశంలో చొప్పింపబడ్డాయనీ వారి అభిప్రాయం. అంతేకాదు. కాలం ఎల్లప్పుడూ ఒకేవేగంతో పరుగిడుతుందనీ, పదార్థంయొక్క చలనం మీద అది ఆధారపడదనీ వారు అభిప్రాయపడేవారు.

స్థలం, కాలం అనేవి పదార్థంయొక్క అస్తిత్వాన్ని తెలియజేసే సార్వత్రికరూపాలు గనుక అవి పరమయాథార్థములు (Absolute). ఏదీకూడ స్థలానికీ, కాలానికీ అతీతంగా ఉండజాలదు. అయితే వాటి ధర్మాలను మనం మార్పుచేయవచ్చు. ఎందుకంటే స్థల కాల సంబంధాలు పదార్థచలనం యొక్క వేగంమీద ఆధారపడతాయి. అనంతవిశ్వంలోని వేర్వేరుభాగాల్లో స్థల కాల ధర్మాలు ద్రవ్యరాసుల (Masses) స్థానాన్నిబట్టి, చలనాన్ని బట్టి మారుతూ ఉంటాయి. ఈఅర్థంలో స్థలం, కాలం సాపేక్షాలు.

స్థల, కాలాల భౌతిక అస్తిత్వాన్ని నిరాకరించే యత్నాలు

మానవుడు అనేకశతాబ్దాలలో గడించిన దైనందిన జీవితానుభవాన్ని బట్టీ, శాస్త్రపరిశోధనల వల్ల లభించిన సమాచారాన్ని బట్టీ స్థలం, కాలం

భౌతికఅస్తిత్వాన్ని కలిగియున్నాయని రుజువయింది. అయితే చాలమంది భావవాదులు యీవిషయాన్ని అంగీకరించరు.

జర్మన్ భావవాది ఇమ్మాన్యుయెల్ కాంట్ మన చైతన్యానికి (ఆలోచనా ప్రపంచానికి) వేరైన స్థల, కాలాలు భౌతికంగా అస్తిత్వాన్ని కలిగియుండవని తెలియజేశాడు. ఆయన అభిప్రాయంలో స్థలం, కాలం అనేవి పరిణామాలను అర్థంచేసుకొనేందుకు ఉపయోగపడే రీతులు మాత్రమే. ఎందుచేతంటే, స్థల కాలాల్లో జరిగే సమస్త పరిణామాలను తెలుసుకొనే; స్వభావం మానవచైతన్యానికుంది; మానవచైతన్యమే లేకపోతే స్థలమూ లేదు, కాలమూలేదు.

పరిణామాలను తెలుసుకొనేందుకు స్థల. కాలాలు మానసిక సాధనాలనే అభిప్రాయం ఆధునిక భావవాదధోరణుల్లో కూడ మనకు కనిపిస్తుంది. అయితే యిది విజ్ఞానశాస్త్రానికి జీవితానుభవానికి వ్యతిరేకం. పై అభిప్రాయం తప్పని యివి రుజువుచేశాయి.

ఒక ఉదాహరణ తీసుకుందాం. మనం పారిస్‌నుంచి మాస్కోకు ప్రయాణం చేయాలనుకొందాం. ఆ రెండు పట్టణాల మధ్య దూరం 2500 కిలోమీటర్లు (1 కిలోమీటర్ = దాదాపు 5 ఫర్లాంగులు) అనే విషయం మనకు ముందే తెలిసిఉండాలి. ఇది నిజమైన దూరమే గాని ఊహాజనితమైనది కాదు. ఆ దూరమంతా ప్రయాణం చేయడానికి కొంతకాలం పడుతుంది. ఎంతకాలం పడుతుందనేది తన ఊహమీద కాకుండా, ఆ రెండు పట్టణాల మధ్యనున్న దూరంమీదా, రవాణా సాధనాల మీదా ఆధారపడుతుంది. రైల్లో ప్రయాణంచేస్తే రెండురోజులకు తక్కువపట్టదు; జెట్ విమానంలో అయితే మూడు నాలుగు గంటల్లో చేరుకోవచ్చు.

మానవుడూ, మానవచైతన్యం రూపొందకముందే ప్రపంచం ఉన్నదని విజ్ఞానశాస్త్రం చెబుతోంది. అటువంటప్పుడు స్థలం, కాలం మానవ

చైతన్యంతో సంబంధంలేకుండా, వేరుగా ఉంటాయని నిర్ధారణకు రావలసి యుంటుంది. కారణమేమంటే, భౌతికప్రపంచం స్థల, కాలాల్లో తప్ప ఉండ లేదు.

ఆధునికయుగంలో శాస్త్రీయసిద్ధాంతాలే కాక, మానవనిర్మితమైన యంత్రాలు కూడ విశ్వాంతరాళంలోకి చొచ్చుకు పోగల్గుతున్నాయి. ఆవిధంగా స్థల. కాలాలు మానసిక సాధనాలనే భావవాదసిద్ధాంతం తప్పు అని మరొకసారి రుజువయింది.

బాహ్యప్రపంచం స్థల, కాలాల్లో ఉంటుందన్న భౌతికవాద సిద్ధాంతం స్థల. కాలాల కతీతంగా భగవంతుడున్నాడన్న మత సిద్ధాంతాన్ని వ్యతిరే కిస్తుంది. ప్రపంచం పుట్టకముందే భగవంతు డున్నాడనీ, ప్రకృతిని అతడు సృష్టించి, తాను మాత్రం ఆ ప్రకృతికి బయట, దాని కతీతంగా, మనమెవరం తెలుసుకోలేని "ఒకచోట" ఉంటాడనీ ఈశ్వరవాదం (Theology) చెబు తుంది. భగవంతుడు ఆదిమధ్యాంత రహితుడు; అజరామరుడు; ప్రకృతి అలాకాదు; స్థల కాలాల్లో దానికి ఆదీ అంతం ఉంటాయి—అని ఈశ్వరవాదు లంటారు.

ఇట్టి భ్రాంతులు నిరాధారమని విజ్ఞానశాస్త్రం ఖండితంగా నిరూపిం చింది. ప్రపంచాన్ని గురించిన వాస్తవికదృక్పథంలో, శాస్త్రీయదృక్పథంలో భగవంతునికి స్థానం లేదు. 18 వ శతాబ్దపు ఫ్రెంచి ఖగోళశాస్త్రజ్ఞుడు జోసెఫ్ లలాండ్. ఆకాశమంతా ఎంత వెతికినా తాను భగవంతుణ్ణి చూడ లేక పోయానని చెప్పాడు.

ప్రకృతికి కారణం ప్రకృతే. ఈ అభిప్రాయాన్ని స్పైనోజా అను భౌతికవాది 17 వ శతాబ్దంలో వెల్లడించాడు. దీని అర్థం ఒకటే : ప్రకృతికి సృష్టికర్త అక్కర్లేదు ; ప్రకృతికి అతీతమైన సృష్టికర్త ప్రకృతికి అనవ సరం. ఆద్యంతరహితస్థితి. శాశ్వతస్థితి ప్రకృతికే ఉన్నాయి ; అంతేగాని,

ఈశ్వరవాదులు చెప్పేటట్లు భగవంతునికి లేవు. వారుచెప్పేది తప్పు సిద్ధాంతం.

ప్రకృతి సృష్టింపబడేది కాదనీ, ఆద్యంతాలు లేనిదనీ, శాశ్వతమైన దనీ నిరూపించడం ద్వారా, మార్క్సిస్టు భౌతికవాదం నాస్తికవాదానికి గట్టి పునాది వేసింది.

౬. ఒక ప్రత్యేక పద్ధతిలో నిర్మితమైన పదార్థధర్మమే చైతన్యం. సజీవపదార్థం యొక్క పరిణామ ఫలితమే ఆలోచన.

ఆలోచనాశక్తి మానవుని ప్రత్యేకలక్షణం. అయితే, యిది ఉన్నతజంతువుల్లో కూడ ప్రాథమిక రూపంలో ఉంటుంది. జీవరాసుల్లో బాహ్య ఆంతరిక ప్రపంచాలు అంతకంతకు క్లిష్టంగా ప్రతిబింబించే క్రమంలో ఒక సుదీర్ఘచారిత్రకాభివృద్ధి ఫలితంగా అది ఉత్పన్నమవుతుంది.

ప్రాణానికి భౌతికాధారం మాంసకృత్తులు (Proteins). ప్రాణుల జీవిత వ్యాపారానికి మూలాధారమైన ఆహారపచనంలో (జీర్ణక్రియ) మాంసకృత్తులు నిర్ణయాత్మకపాత్ర వహిస్తాయి. ఆహార పచనంతో దగ్గరసంబంధం గల యితర లక్షణాలు సంతానోత్పత్తి, ప్రకోపనం (Irritability) వగైరా. ప్రకోపనంవల్ల ప్రాణులు ఉత్తేజనం పొందడంద్వారా ఆంతరిక. బాహ్య ప్రేరణల (Stimuli) పిలుపు నందుకుంటాయి. ఈ ఉత్తేజనమే ప్రతిచర్యయొక్క (Reflex activity) ప్రాథమికరూపం. అతిప్రాథమిక జీవుల లక్షణమైన ప్రకోపనం ప్రాణుల ఉన్నత పరిణామ దశల్లో ఉన్నత నాడీమండల (Nervous activity) వ్యాపారానికి, అంటే మనోవ్యాపారానికి, ప్రాతిపదికగా రూపొందుతుంది.

ఏకకణజీవుల్లో సైతం రకరకాలైన బాహ్యప్రేరణలకు ఉత్తేజనం పొందే శక్తులమధ్య వ్యత్యాసముంటుంది. బహుకణజీవులైన జంతువులు ఉత్పన్నమవడంతో, బాహ్యప్రేరణల నందుకొని ఉత్తేజనశక్తిని ఉద్రిక్తస్థితిగా (excitation) మార్చగల ప్రత్యేక జీవకణసముదాయా లేర్పడతాయి. ఈ విధంగా జీవకణాలు ప్రత్యేక తరగతులుగా విభజింపబడతాయి. జంతువుల్లో అంగనిర్మాణం సంక్లిష్టమయేకొద్దీ ఈజీవకణాలు క్రమక్రమంగా నాడీమండలంగాను, దానికి కేంద్రావయవమైన మెదడుగాను పరివర్తన చెందుతాయి.

నాడీమండలం శరీరంలో ఒకఅంగం. దాని నిర్మాణం, దాని వ్యాపారం ఎలాంటివంటే, బాహ్యప్రపంచంయొక్క రకరకాలైన సకలశక్తి ధర్మాలు (Energetic properties) స్థల - కాలధర్మాలు (Spatial-temporal properties) అందులో ప్రతిబింబిస్తాయి; అదేసమయంలో నాడీ మండలం అంగనిర్మాణంలోని వివిధ అంగాల పనిని సమన్వయపరుస్తుంది.

వెన్నెముకగల ప్రాణుల్లో (చేప, పక్షి, కప్ప, పాము మొదలైనవి) వెన్నెముకా, వేర్వేరు విభాగాలతో కూడిన మెదడూ కలిసి నాడీమండలం అవుతుంది. అనేకచేపల్లో మెదడు చాల చిన్నదిగా ఉంటుంది; దానికి సంబంధించిన అర్ధగోళాలింకా అభివృద్ధిచెందవు. ఉభయచరాల్లో (నీటిలోను నేల మీద కూడ నివసించే ప్రాణులు) మెదడు అంతకన్న పెద్దది; అది మెదడుకు సంబంధించిన అర్ధగోళాల నిర్మాణానికి (Cerebral hemespheres) ప్రాతిపదిక అయిన మజ్జాముఖం (Cortex) వాటిలో ఏర్పడుతూ ఉంటుంది. సరీసృపాల్లో (Reptiles) మెదడు యింకా చక్కగా అభివృద్ధి చెందుతుంది. మొట్టమొదటిసారిగా అర్ధగోళాల పైపొరమీద నాడీకణాలు కనిపిస్తాయి వాటి నుంచే మజ్జాముఖం ఏర్పడుతుంది. పక్షులలో మెదడుకు సంబంధించిన అర్ధగోళాలు యింకా పెద్దవిగా ఉంటాయి; అయితే మజ్జా ముఖం అంతగా అభివృద్ధి చెందదు. స్తనజీవుల్లో (Mammals) యీఅర్ధగోళాలు యింకా

అభివృద్ధిచెందుతాయి. కారణమేమంటే, వాటి మజ్జాముఖం బాగా అభివృద్ధి చెంది, క్లిష్టమైన నిర్మాణం కలిగియుంటుంది. ఉన్నత సస్తన జీవుల్లో (Higher mammals) మజ్జాముఖం పెద్దదిగాఉంటుంది; అనేక పొరలతోను ముడుతలతోను నింపియుంటుంది. అంతేకాదు. అర్ధగోళాలు మెదడుయొక్క యితర భాగాలన్నిటినీ కప్పుతాయి.

మానవుని మెదడు ముఖ్యంగా మజ్జాముఖం యితర జీవరాసులన్నిటిలో కంటె ఎక్కువగా అభివృద్ధి చెందింది. నాడీ మండలమంతటిలో నిరంతరం ప్రతిచర్య జరిపే సాధనం మజ్జాముఖం. ఉన్నత నాడీ వ్యాపారానికి సంబంధించిన అవయవంకూడ యిదే. అంతేకాదు. బాహ్యపరిసరాలతో అత్యంత క్లిష్టమైన, అత్యున్నతమైన సంబంధంగల అవయవం యిది. "మెదడు అనే పదార్థంలో జరిగే శారీరక వ్యాపారం ఫలితమే మనో వ్యాపారం", అన్నాడు, ప్రఖ్యాత రష్యన్ శరీరశాస్త్రజ్ఞుడు ఇవాన్ పావ్లోవ్ (పావ్లోవ్ రచనలు: సంపుటి 3, భాగం 2. మాస్కో 1951). ఆధునిక ప్రకృతి శాస్త్రజ్ఞులంతా చేసిన నిర్ధారణ యిదే.

బాహ్య. ఆంతరిక ప్రేరణలవల్ల గ్రాహకనాడుల కొసలు (Sensory nerve - endings) ఉద్రిక్తములవుతాయి. ఆ ఉద్రిక్తత కేంద్రంవైపు పయనించే వాహకనాడులద్వారా మెదడులోని ఆయాభాగాలకు ప్రసారమవుతుంది. కేంద్రంనుంచి పయనించే వాహకనాడులు ఆ ప్రేరణలను మెదడునుంచి వివిధ శరీరావయవాలకు తీసుకెళ్తాయి. తత్ఫలితంగా వాటి వ్యాపారం ప్రకోపిస్తుంది. అప్పుడు ఆ అవయవమూ, మొత్తంప్రాణీ ఏదో ఒక ప్రేరణవల్ల ప్రతిచర్యకు (Reflex action) లోనవుతాయి.

ఉదాహరణకు, ఒక వేడిపదార్థంలోనుండి మనం చేతిని చటుక్కున లాగివేసుకుంటాం అదొక ప్రతిచర్య. దీన్నే మానసికశాస్త్రజ్ఞులు సహజ ప్రతిచర్య (Unconditioned reflex) అంటారు. ఇది జంతువుల్లోను, మనుష్యుల్లోను కూడ స్వతస్సిద్ధంగా ఉండేలక్షణం.

ఈ సహజ ప్రతిచర్యలు (ఆత్మరక్షణ, ఆహారం తీసుకోడం వగైరా) *ఆగంతుక ప్రతిచర్యలకు* (Conditioned reflexes) ప్రాతిపదిక. ఆగంతుక ప్రతిచర్యలు వ్యక్తిగత అనుభవంలో రూపొందుతాయి. ఉదాహరణకు, కుక్క మాంసపుముక్క తినేటప్పుడు దాని నోట్లో నీరూరుతుంది. అది సహజ ప్రతిచర్య. కాని, మాంసం చూచినప్పుడు దాని వాసన తగిలినప్పుడు కూడా దానినోట్లో నీరూరుతుంది. అలవాటుగా ఆహారం పెట్టే మనిషి కనబడినప్పుడు కూడా దానినోట్లో నీరూరుతుంది. ఈ ఘటనలను, యిలాంటి యితర ఘటనలను పావ్లోవ్ పరిశీలించాడు. ఆపరిశీలనల ఆధారం మీద అతడు కుక్కకు ఆహారం పెట్టేటప్పుడల్లా గంట కొట్టడమో, దీపం చూపించడమో చేస్తే, ఒక కొత్తరకమైన ప్రతిచర్య ఏర్పడుతుందని నిరూపించాడు. దీపం చూచినప్పుడు లేదా గంటశబ్దం విన్నప్పుడు దాని నోట్లో నీరూరుతుంది; దీన్నే పావ్లోవ్ *ఆగంతుక ప్రతిచర్య* అని అన్నాడు. ఎందుచేతంటే, సహజప్రేరణలకు వెలుతురు, శబ్దం వంటి బాహ్యప్రేరణలను జోడించడం వల్ల ఆగంతుక ప్రతిచర్య కలుగుతుంది.

ఆగంతుక ప్రతిచర్యలు తాత్కాలికమైన నాడీసంబంధాలు. అవి కొన్ని నిర్దిష్టపరిస్థితుల్లోనే ఉత్పన్నమవుతాయి. సహజప్రతిచర్యల సహాయమక్కర్లేకుండా అవి స్వల్పకాలమో దీర్ఘకాలమో నిలిచి ఉంటాయి. పరిసరాల్లో వచ్చే మార్పుల కనుగుణంగా ప్రాణులు మార్పు చెందడానికివి సహాయపడతాయి. ఇదే వాటి ప్రాముఖ్యత. ఉదాహరణకు, చాల అడవిమృగాలు మొట్టమొదటిసారి మానవుల్ని చూచినప్పుడు కొంచెంకూడ భయపడవు. మానవుడు వాటిని వేటాడ్డం మొదలుపెట్టిన తర్వాతే వాటి ప్రవర్తనలో మార్పు వస్తుంది మానవుణ్ణి చూచినవెంటనే, లేదా పసికట్టినవెంటనే అవి దాక్కొంటాయి. అంటే, ఒక కొత్తప్రతిచర్య-ఆగంతుక ప్రతిచర్య-వాటికి అలవడిందన్నమాట. ఇది వాటికి చాల ఉపయోగకరమైనది. మనిషి కనబడిన వెంటనే ఒక సహజప్రతిచర్య- రక్షణప్రతిచర్య - వాటిలో కలుగుతుంది.

బాహ్యపరిస్థితుల కనుగుణంగా జరిగే ఉద్దేశపూర్వకమైన ప్రేరణకు అది సంకేతం.

ఏవస్తువునైనా, ప్రకృతిపరిణామాన్నైనా సహజప్రతిచర్యతో జోడించినప్పుడు, అది ఆగంతుక ప్రతిచర్యకు సంకేతంగా ఉపయోగ పడుతుంది. ఇది అందరికీ తెలిసిన విషయమే. ఇట్టి సంకేతాలు జంతువుల్లోను, మనుష్యుల్లోను కూడా ఉంటాయి. దీన్నే పావ్లోవ్ *మొదటి సంకేతక్రమ* మని పిలిచాడు.

పావ్లోవ్ కనిపెట్టిన సంకేతక్రమాల్లో ఒక ప్రధానాంశం ఏమంటే, జీవరాసులు భవిష్యత్పరిణామాల కనుగుణంగా నప్పుకుంటాయని భావవాద మనస్తత్వ శాస్త్రజ్ఞులు మొదటినుంచీ చెప్పే విషయం పావ్లోవ్ పరిశోధనల తర్వాత భౌతిక వాదుల శాస్త్రపరిశోధనాంశంగా పరిణతి చెందింది.

అదే సమయంలో, మానవుని ఉన్నత నాడీమండల వ్యాపారం ప్రత్యేకస్వభావాన్ని కలిగియుంటుందని పావ్లోవ్ నొక్కిచెప్పాడు. భాష అనేది ఒక కొత్త సంకేతక్రమమనీ, అది మానవుని ప్రత్యేక లక్షణమనీ ఆయన తెలియజేశాడు. ఆగంతుక ప్రతిచర్యలకు అది మూలం అవుతుంది. మానవుని ప్రత్యేక లక్షణమైన యీ సంకేతక్రమాన్ని పావ్లోవ్ *రెండవ సంకేతక్రమ* మని పిలిచాడు.

జంతువుల్లోని, మానవుల్లోని ఉన్నత నాడీమండల వ్యాపారం ఏ శరీర నిర్మాణ సూత్రాల ననుసరించి జరుగుతుందో, ఆ సూత్రాలను పావ్లోవ్ కనిపెట్టాడు. జంతువులకు, మనుష్యులకు సమానంగా ఉండే లక్షణాలనూ ప్రధాన వ్యత్యాసాన్నీ ఆయన చూపించాడు. మానవుని మనోవ్యాపారం గూర్చి తెలుసుకొనేందుకు ఆయన కృషి ఒక చక్కని శాస్త్రీయ పునాది.

ఆలోచనల అభివృద్ధిలో శరీరశ్రమ, భాష నిర్వహించే పాత్ర

మానవుని మనోవ్యాపారం వంటిదే జంతువుల్లోకూడ ప్రాథమిక రూపంలో ఉంటుంది. కాని రెండిటిమధ్య గల గుణాత్మక వ్యత్యాసాన్నికూడ మనంచూడాలి. మనోవ్యాపార అభివృద్ధిలో ఆలోచన అనేది అత్యున్నత దశ. మానవుడు సంఘజీవిగా చేసే శరీరశ్రమనుబట్టి అతని మనోవ్యాపారం మహోన్నత శిఖరాన్నందుకొంది. అదే ఆలోచన.

నరుని పూర్వీకులూ, వానరుని పూర్వీకులూ ఒకరేనని ప్రఖ్యాత ఆంగ్లశాస్త్రజ్ఞుడు ఛార్లెస్ డార్విన్ నిరూపించాడు. అతి ప్రాచీనకాలంలో మానవుని పూర్వీకులైన జంతువులకు ముందుకాళ్లు బాగా అభివృద్ధిచెందాయి. వెనుక కాళ్ళమీద నిటారుగా నిలబడ్డం వాటికి చేతనయింది. ఆహారం సంపాదించుకోడానికీ తమ్ముతాము రక్షించుకోడానికీ అవి సహజవస్తువులను పనిముట్లుగా ఉపయోగించడం మెలాగో నేర్చుకున్నాయి. తర్వాత అవి పనిముట్లను తయారుచేయడం నేర్చుకున్నాయి. తత్ఫలితంగా జంతువు క్రమేణా మానవుడుగా మార్పుచెందింది. మానవుడు పనిముట్లను తయారు చేసి ఉపయోగించడం ద్వారా అగ్ని మొదలైన ప్రకృతిశక్తుల్ని అదుపులో ఉంచుకొనగలిగాడు. అంతేకాదు. తన ఆహారాన్ని వృద్ధిపరచుకోగలిగాడు; రకరకాల ఆహారం సంపాదించుకోగలిగాడు. ఆ ఆహారం తిరిగి అతని మెదడును అభివృద్ధిచేయడంలో తోడ్పడింది.

పనిముట్ల ఉపయోగం ప్రకృతికీ మానవునికీ గల సంబంధాన్ని మార్చివేసింది. ప్రకృతి ప్రసాదించిన వాటినే జంతువు ఉపయోగించు కొంటూ, క్రియారహితంగా ప్రకృతి కనుగుణమైన మార్పులు పొందుతుంది. మనుష్యుడలా కాదు. అతడు ఏదోఒక ప్రయోజనం కొరకు ప్రకృతిని మార్చుతాడు; తనకై సిద్ధంగాలేని, తన జీవితాని కవసరమైన పరిస్థితుల్ని

అతడు సృష్టించుకొంటాడు. ఆవిధంగా మానవుడు క్రియాత్మకంగా ప్రకృతి కనుగుణమైన మార్పులు పొందుతాడు. మానవుని మెదడు అభివృద్ధి చెందడంలోను, పరిణతి చెందడంలోను శరీరశ్రమ నిర్ణయాత్మకపాత్ర వహించింది. ఒక విధంగా మానవుడూ, అతని మెదడూ శరీరశ్రమ యొక్క సృష్టి అని చెప్పవచ్చు.

మానవుడు తన పరిసరాల కనుగుణంగా నప్పుకోడంలో బ్రహ్మాండమైన అభివృద్ధిని సాధించాడు. ఈ అభివృద్ధి బాహ్యప్రపంచాన్ని మార్చడంలో కనిపిస్తుంది. ఇదెలా సాధ్యమైంది? మానవవ్యాపారం యొక్క, మానవ శ్రమయొక్క ఫలితాలను అంచనా వేయగలశక్తి మానవుని మెదడుకు ఉంది. ఆ శక్తిని అపారంగా అభివృద్ధి చేసుకోడంద్వారానే యిది (బాహ్య ప్రపంచాన్ని మార్చడం) సాధ్యపడింది. ఆధునిక మానవుని పూర్వీకుడైన వానరుడు మొట్టమొదటి పరికరాన్ని (Tool) తయారు చేసినప్పుడు యీ శక్తి అభివృద్ధి కావడానికి బలమైన ప్రోద్బలం కలిగింది. రెండోవైపు, మానవ శ్రమయొక్క ఫలితాలను అంచనా వేయడంలో మెదడుకుగల శక్తి శ్రమకవసరమైన పరికరాలను వేగంగా అభివృద్ధి చేయడానికి ప్రాతిపదికగా కూడ ఉపయోగపడింది.

మానవునికీ ప్రకృతికీ మధ్య జరిగే యీ పరస్పర ప్రతిస్పందన జంతువుల్లోకంటె క్లిష్ట రూపంలో ఉంటుంది. తత్ఫలితంగా, మానవుల మధ్య సంబంధాలు జంతువుల్లోకంటె క్లిష్టంగా ఉంటాయి. మానవులు కలిసి శ్రమించడానికి ఒకరితో ఒకరు సంబంధం పెట్టుకోవలసి వచ్చింది. జంతువులకు సరిపడిన కొద్దిపాటి శబ్దాలు మనుష్యులకు చాలలేదు. మానవుడు శ్రమించేక్రమంలో అతని గొంతు క్రమంగా అభివృద్ధిచెంది, మార్పుచెందింది. మాటలవంటి శబ్దాలను ఉచ్చరించడం అతడు నేర్చుకున్నాడు. అవి క్రమేణా మాటలుగా, భాషగా అభివృద్ధిచెందాయి. మాట్లాడగల శక్తి లేనిదే మానవుడు కలిసి శ్రమించడం అసాధ్యమైయుండాలి.

మాటలే లేకపోతే, వస్తువులను గురించిన భావాలు, వాటి మధ్య సంబంధాలు ఉత్పన్నమయేవే కావు. మానవుడు ఆలోచించడమే అసంభవ మయేది. ఈ విధంగా అభివృద్ధి చెందిన భాష తిరిగి మెదడును అభివృద్ధి చేయడంలో సహాయపడింది.

కాబట్టి మెదడు అభివృద్ధిచెందడంలో, ఆలోచనాశక్తి పెంపొంద డంలో మానవుని సామాజికశ్రమ, ఆ తర్వాత దానితో సంబంధంగల భాష నిర్ణయాత్మకపాత్ర వహించాయి.

చైతన్యం మెదడుయొక్క ధర్మం

చైతన్యం లేదా ఆలోచన మేథో వ్యాపారంనుంచి (మెదడు చేసే పనులనుంచి) ఉత్పన్నమవుతుంది. అత్యంత క్లిష్టమైన గ్రాహ కేంద్రీయా లతో మెదడుకు సన్నిహితసంబంధం ఉంది. స్థూలంగా చెప్పాలంటే, చైతన్యం భౌతికప్రపంచం యొక్క ప్రతిబింబం. అనేక బహుముఖ పరిణామప్రక్రియ. రకరకాలైన మానసికవ్యాపారాలు దానిక్రిందికి వస్తాయి. ఉదా: ఇంద్రియానుభూతి, అనుభూతి, భావన, ఆలోచన, సంవేదన, ఇచ్ఛ. మెదడు సరిగా పనిచేయకపోతే, మామూలుగా జరిగే మనోవ్యాపారం అసంభవమవుతుంది. జబ్బువల్లగాని, మత్తుపదార్థం వల్లగాని మెదడు సక్రమంగా పనిచేయకపోతే, మనోవ్యాపారం దెబ్బతింటుంది. మస్తిష్కం చేసేపని పాక్షికంగా, తాత్కాలికంగా మందగిస్తే, నిద్రవస్తుంది. అప్పుడు ఆలోచన ఆగిపోతుంది; చైతన్యం మోడువడుతూంది. వేర్వేరు మందుల ద్వారా మానవుని మనోవ్యాపారాన్ని, ఉద్రేకాలనూ మనం కోరే దిశలో ప్రభావితం చేయవచ్చునని యిటీవల జరిగిన పరిశోధనలు రుజువు చేస్తు న్నాయి. దీన్నిబట్టి, చైతన్యం రూపొందడంలో భౌతికమైన మస్తిష్కం, దాని వ్యాపారం ప్రధానపాత్ర వహిస్తాయని మరోసారి నిరూపించబడింది.

కాని, యీ సవ్యమైన భౌతికవాద సూత్రాలనుంచి మనం పొరబాటు నిర్ధారణకు రాకూడదు. ఆలోచన అనేది మెదడునుంచి బయల్వెడలే ఒక వస్తువని అభిప్రాయపడకూడదు. ఆలోచన మెదడునుంచి ఊరే ఒక ప్రత్యేక పదార్థమని 19 వ శతాబ్దపు జర్మన్ బూర్జువా భౌతికవాది కారల్ వోట్ నిర్వచించాడు. లాలాజలగ్రంధులు లాలాజలాన్నీ పైత్యకోశం పైత్య రసాన్నీ ఎలా తయారుచేస్తాయో అలాగే మెదడుకూడా ఆలోచనను తయారుచేస్తుందని అతడన్నాడు. ఇది పూర్తిగా తప్పు. ఆలోచనను గూర్చిన అశిక్షిత (Crude) భావం యిది. మనోవ్యాపారం, అంటే ఆలోచన చైతన్యంపదార్థంయొక్క ప్రత్యేకగుణం; అంతేగాని అదొక ప్రత్యేక పదార్థం కాదు.

తత్వశాస్త్రానికి సంబంధించిన కీలకసమస్య చర్చకు వచ్చినప్పుడు చైతన్యం వేరు పదార్థం వేరు అనీ ఆత్మ వేరు ప్రకృతి వేరు అనీ వ్యత్యాసం చూపుతాం. మన చైతన్యానికి బయట స్వతంత్ర అస్తిత్వం గల ప్రతీదీ పదార్థమే. అందుచేత, చైతన్యం పదార్థంలో భాగమనుకోవడం చాల పొరపాటు. లెనిన్ యిలా చెప్పాడు :

"ఆలోచన పదార్థసంబంధంగు దనుకోవడం తప్పుటడుగు వేయ డమే: భౌతికవాదాన్ని భావవాదంగాను, భావవాదాన్ని భౌతికవాదంగాను గందరగోళపరిచే తప్పుటడుగు అది." (లెనిన్ రచనలు : సంపుటి 14: పుట 231; మెటీరియలిజం అండ్ ఎంపిరియోక్రిటిసిజం : మాస్కో 1952; పుట 251).

నిజానికి పదార్థం, ఆలోచన ఒకటే అయితే, పదార్థానికీ ఆలో చనకూ వ్యత్యాసమే లేకుండా పోయేది; రెండూ ఒకటే అయిపోయేవి.

మార్క్సిజాన్ని భావవాదదృష్టి నుంచి వ్యతిరేకించేవారు, చైతన్యం భౌతికమైనదనే అభిప్రాయాన్ని మార్క్సిస్టులకు ఆపాదిస్తున్నారు. మార్క్సిస్టు

భౌతికవాదాన్ని మరింత సులభంగా "ఖండించేందుకు" వారలా చేస్తున్నారు. వ్యతిరేకులమీద ఒక అభాండం వేయడం, తర్వాత దాన్ని "చావుదెబ్బ కొట్టడం" – యిది చిరకాలంనుంచీ అనుసరింపబడుతున్న యుక్తే.

నిజం చెప్పవలసివస్తే, పదార్థమూ చైతన్యం ఒకటేనని గతితార్కిక భౌతికవాదం చెప్పదు; అశిక్షిత భౌతికవాదం మాత్రమే అలా చెబుతుంది. మార్క్సిస్టు భౌతికవాదం మొదటినుంచీ యీ అభిప్రాయాన్ని ఖండిస్తూనే వచ్చింది. పదార్థానికీ, పదార్థాన్ని (భౌతిక ప్రపంచాన్ని) ప్రతిబింబించే చైతన్యానికీ గల వ్యత్యాసాన్ని అది యెల్లప్పుడూ చూపుతూనే వుంది.

అయితే, యీ వ్యత్యాసాన్ని ఉత్ప్రేక్షించకూడదు; రెండిటికీ సంబంధమే లేనట్లు చూడకూడదు. పదార్థానికీ, చైతన్యానికి ఎట్టి సంబంధమూ లేదనే సిద్ధాంతం "సైకోఫిజికల్ పేరలలిజం". ఆలోచన, చైతన్యం అనేవి స్వతంత్రంగా, పదార్థక్రమాలతో సంబంధం లేకుండా, వాటి సరసన మెదడులో జరుగుతాయని వీరంటారు. ఈ దృక్పథాన్ని విజ్ఞాన శాస్త్రం ఒప్పుకోదు. మానసికవ్యాపారం ప్రాణుల జీవితవ్యాపారంలో ఒక ప్రత్యేకాంశ అనీ, మెదడుకు సంబంధించిన ప్రత్యేక ప్రక్రియ అనీ విజ్ఞాన శాస్త్రం రుజువుచేసింది.

పదార్థానికీ చైతన్యానికీ సంబంధమే లేదన్న అభిప్రాయాన్ని గతి తార్కిక భౌతికవాదం నిరాకరిస్తుంది. అట్టి అభిప్రాయాన్ని అంగీకరించడ మంటే, మానవజాతి ఆదిమ చరిత్రలో ప్రచలితమై ఉండే మూఢవిశ్వాసా లను తిరిగి సమాజంలో ప్రతిష్ఠించడమన్నమాట. ఆ రోజుల్లో ప్రతి జీవిత వ్యాపారం ఆత్మవల్ల జరుగుతుందనీ, ఆ ఆత్మ శరీరంలో ప్రవేశించి శరీ రాన్ని నడుపుతుందనీ ప్రజలు భావించేవారు.

మనో వ్యాపారానికీ, దాని అవయవమైన మెదడుకూ, (శరీరావయ వంగా, పాదార్థిక అవయవంగా) గల సంబంధం–అంటే మనశ్శరీర

సంబంధం—ఎట్టిదనే సమస్యను పరిష్కరించాలంటే, వాటిమధ్య గల వ్యత్యాసాన్నీ, సంబంధాన్నీ కూడ మనం గమనించాలి. పదార్థం—చైతన్యం ఒకటే ననుకొంటే, అర్థంలేని అపసవ్యనిర్ధారణకు వస్తాం. అందుచేత ఈ రెండింటి మధ్య గల వ్యత్యాసాన్ని దృష్టిలో ఉంచుకోడం ముఖ్యం. రెండోవైపు, చైతన్యాన్ని మెదడునుంచి వేరుచేసి చూడకూడదు. ఎందుకంటే, చైతన్యమనేది మెదడుయొక్క ప్రక్రియ. ఆ మెదడు ఒక ప్రత్యేక పద్ధతిలో నిర్మితమయిన పదార్థం.

6. తాత్త్విక భౌతికవాదాన్ని వ్యతిరేకించేవారి భావాలు

ప్రపంచమంతా ఒకటేననీ, అది పదార్థమయమనీ మార్క్సిస్టు భౌతికవాదం చెబుతుంది. అవిధంగా *ఏకతాభావాన్ని* (Monism) ప్రతిపాదిస్తుంది. ఇంగ్లీషులో మోనిజం అనేమాట 'మోనోస్' అను గ్రీకుశబ్దం నుంచి పుట్టింది. 'మోనోస్' అంటే అర్థం 'ఒకటి'. మార్క్సిస్టు భౌతికవాదం సమస్తపరిణామాలను ఒకేఒక ప్రాతిపదికనుంచి, భౌతికవాద ప్రాతిపదిక నుంచి, పరిశీలించి వివరిస్తుంది.

అయితే భావం ప్రధానమనిగాని, పదార్థం ప్రధానమనిగాని అంగీకరించని తాత్వికధోరణులు కూడా కొన్ని ఉన్నాయి. వాటి మూలసూత్రం ద్వైవిధీభావం (Dualism). ఇంగ్లీషులో డ్యూయెలిజం అనేమాట 'డ్యూవో' అను లాటిన్ మాట నుంచి పుట్టింది. 'డ్యూవో' అంటే అర్థం 'రెండు'. ప్రపంచానికి రెండు మూలాధారాలున్నాయనీ, అవి ఒకదానితో ఒకటి సంబంధం లేకుండా, స్వతంత్రంగా ఉంటాయనీ, అవి పూర్తిగా భిన్న స్వభావం గలవనీ ద్వైవిధీవాదులు నిరూపించ యత్నిస్తారు. అవి: పదార్థం, చైతన్యం; శరీరం, మనస్సు; ప్రకృతి, భావం. ఫ్రెంచి తాత్వికుడు డెకార్టే అభిప్రాయం యిదే.

కాని మానవశరీరంపై పడే ప్రభావాలు ఎందుకు చైతన్యంలో మార్పు తీసుకువస్తాయో, అదే విధంగా ఎందువల్ల ఆలోచన శరీరంలో మార్పులకు కారణమవుతుందో ద్వైధీవాదులు వివరించలేరు. అందుచేత ద్వైధీవాదం పాక్షికమైనది. అనిశ్చితమైనదీను; అది సర్వసాధారణంగా భావవాదానికి దారితీస్తుంది.

ప్రపంచానికి రెండు మూలాధారాలు లేవనీ. భావమొక్కటే మూలాధారమనీ చెప్పేవారు మరికొందరున్నారు. వీరుకూడ భావవాదులే. వీరి ఏకతాదృష్టి అపసవ్యమైన. శాస్త్రవిరుద్ధమైన పునాదిమీద నిర్మితమయింది. ఎందుచేతంటే వీరు భావాన్ని, ఆలోచనను. చైతన్యాన్ని ప్రధానాంశాలుగా తీసుకొని, అక్కడనుంచి ప్రారంభిస్తారు; ప్రకృతి, భౌతిక వస్తువులు. మానవ శరీరం ద్వితీయాంశాలనీ. అవి భావంనుంచి ఉత్పన్నమవుతాయనీ వీరి అభిప్రాయం. వీరి దృష్టిలో ప్రతీదీ చైతన్యమయం; లేదా చైతన్య జనితం.

బాహ్యాత్మక భావవాదం (Objective Idealism)

ప్రపంచాన్ని గూర్చిన అతి ప్రాచీనమైన, అయితే యిప్పటికీ అత్యంత వ్యాప్తిలోనున్న, భావవాదదృక్పథం ఈశ్వరుని గూర్చిన మతసిద్ధాంతంగా రూపుదిద్దుకొంది. మనం చూస్తున్న యీ భౌతికప్రపంచం ఏర్పడకముందే ప్రకృతి కతీతమైన ఆత్మ లేదా భగవంతుడు ఉండేవాడనీ. ప్రపంచాన్ని సృష్టించినది ఆ ఆత్మ లేక భగవంతుడనీ మతసిద్ధాంతం చెబుతుంది. ఇలాంటి అభిప్రాయాలు తప్పు అని విజ్ఞానశాస్త్ర చరిత్ర రుజువుచేసింది. పదార్థం చాలా ఉచ్చదశకు పరిణతిచెందాకనే మనోవ్యాపారాలు ఉద్భవిస్తాయనీ, వాటికీ మజ్జాముఖం – నాడీమండలాల్లో జరిగే భౌతిక పరివర్తనలకూ సంబంధముందనీ విజ్ఞానశాస్త్రం ఖండితంగా నిరూపించింది. ఈ భౌతిక, శారీరక పరివర్తనలు లేనిదే మనోవ్యాపారా లుండవు. అందుచేత,

పదార్థానికి ప్రకృతికి ముందు మనస్సు ఒకటి ఉందనే మతసిద్ధాంతం తప్పు: వాస్తవికతకు యిది పూర్తిగా విరుద్ధం.

ఇంతకంటె సూక్ష్మమైన అస్పష్టమైన రూపంలో పై అభిప్రాయాలు (ఈశ్వరుని గూర్చిన మత సిద్ధాంతాలు) భావ వాద ధోరణుల్లో కనిపిస్తాయి. సమస్త వస్తువులకు మూలం కొన్ని ఆధ్యాత్మిక కారణాలు, లేదా శక్తులు, లేదా మూల పదార్థాలు అనీ, భౌతిక ప్రపంచం ఏర్పడకముందే అవి ఉన్నాయనీ వీరు సూత్రీకరించారు. ఇట్టి అభిప్రాయాలను ప్లేటో, లీబ్నిజ్, హెగెల్ అను గొప్ప భావవాద తాత్వికులు ప్రతిపాదించారు. వీరు తాత్విక సమాలోచనల అభివృద్ధికి చాలా సహాయం చేశారు. ప్లేటో, యీ ఆధ్యాత్మిక శక్తులను "రూపాలు" లేక "భావాలు" అన్నాడు. లీబ్నిజ్, సమస్త వస్తువులకు మూలాధారం విచిత్రమైన ఆధ్యాత్మిక "పరమాణువులు" అన్నాడు; అవి ఆధ్యాత్మికంగా క్రియాశీలమైన "యూనిట్ల"ట (కాంతిరేఖలు). హెగెల్, సమస్త పదార్థాలకు మూలం "భావం" అన్నాడు. దానికొక బాహ్యమైన అస్తిత్వం ఉందన్నాడు. ఆయన యిలా వ్రాశాడు : "నిజమైన మూలాధారం భావం. మనకు కనిపించే వస్తువులన్నిటికీ కొన్ని స్వతస్సిద్ధమైన భావనలుంటాయి. అవి ఆ వస్తువుల్లో సాక్షాత్కారమవుతాయి. ఆ భావనల క్రియాశీలత్వంవల్లనే వస్తువులు వేర్వేరు రూపాలు ధరిస్తున్నాయి." (హెగెల్ : Werke, Sechster Band, Berlin, 1840; S 3-3) హెగెల్ అభిప్రాయం ప్రకారం ప్రకృతి అంతా భావం నుంచి ఉద్భవించినదే; ఇది మామూలు భావంకాదు; మానవుని మానోభావం కాదు: మానవునితో సంబంధం లేకుండా, స్వతంత్ర అస్తిత్వం గలిగిన అఖండభావం (Absolute Idea). అంటే భగవంతు డన్నమాట.

ప్లేటో, లీబ్నిజ్, హెగెల్‌ల తత్వశాస్త్రానికి బాహ్యాత్మక భావ వాద (Objective Idealism) మని పేరు.[23] ఎందు చేతంటే, అది

మానవ చైతన్యానికి బాహ్యమైన ఒక స్వతంత్ర ఆధ్యాత్మిక ప్రాతిపదికను గుర్తిస్తుంది.

బాహ్యాత్మక భావవాదుల అభిప్రాయాలు శాస్త్రీయ విమర్శకు నిలబడలేవు. భావాలు, లేదా భావనలు మానవుని ఆలోచనల్లోనే ఉంటాయి; వాస్తవికత యొక్క సాధారణ లక్షణాలనే, గుణాలనే అవి ప్రతిబింబిస్తాయి. భౌతిక ప్రపంచం యొక్క సాధారణ లక్షణాలకు అవి ప్రతిబింబాలు. ఉదా : మానవుడు, సమాజం, సోషలిజం, జాతి, వగైరా. ప్రకృతికి ముందే భావాలున్నాయనీ, అవే ప్రకృతిని సృష్టించాయన్న అభిప్రాయం కేవలం భావవాదుల భ్రాంతి. లెనిన్ యీ విధంగా వ్రాశాడు :

"మానవ భావమంటే ఏమిటో అందరికీతెలుసు. కాని, మానవునితో సంబంధంలేకుండా, అతనికిముందే స్వతంత్రంగా భావం ఒకటిఉందనీ, అది అనిర్దిష్టమైనదనీ అఖండమైనదనే అభిప్రాయం భావవాది హెగెల్ కల్పించిన మతైకసూత్రం తప్ప మరొకటికాదు." (లెనిన్ : రచనలు - 14 వ సంపుటి, పుట 214; Materialism & Empirio-Criticism - Moscow 1952, పుట 232).

స్వీయాత్మక భావవాదం

బాహ్యాత్మక భావవాదంతో బాటు స్వీయాత్మక భావవాదం కూడా (Subjective Idealism) ఒకటి ఉంది. ప్రకృతి ఒక దివ్యభావంనుంచి ఉద్భవించిందని బాహ్యాత్మక భావవాదులు సూత్రీకరిస్తే, భౌతికపదార్థాలన్నీ మన ఇంద్రియానుభూతుల, ఆలోచనల సంచయం మాత్రమేనని స్వీయాత్మక భావవాదులు వాదిస్తారు. వీరు చెప్పేదానిని బట్టి ప్రపంచం స్వీయ చైతన్యంలో, అంటే మానవచైతన్యంలో ఒక భాగం.

స్వీయాత్మక భావవాది "నా చుట్టూ వున్న పదార్థాలను గురించి నే నేమి తెలుసుకోగల్గుతున్నాను ?" అని ప్రశ్నించుకొంటాడు. దీని కతని

ఆవా బిలా ఉంటుంది : "ఆ పదార్థాలనుంచి నేను రంగు, వాసన, రుచి, బరువు, ఆకృతి వగైరా ఇంద్రియానుభూతుల్ని మాత్రమే తెలుసుకోగల్గుతున్నాను; ఈ ఇంద్రియానుభూతుల సంచయాన్ని మించి నేనీ పదార్థాల్లో దేన్నీ చూడలేను. అందుచేత, పదార్థాలన్నీ నా ఇంద్రియానుభూతుల సంచయం మాత్రమేననీ, ఏ వస్తువూ ఇంద్రియానుభూతుల నుంచి వేరుగా, స్వతంత్రంగా ఉండదనీ భావించడం సబబేకదా !"

స్వీయాత్మక భావవాదుల యీ వాదన. మానవునిచుట్టూ ఉండేవి పదార్థాలు కావనీ, అతని ఇంద్రియానుభూతుల ఆభాసలు (Complexes) మాత్రమేననీ. అందుచేత ప్రకృతి అంతా ఇంద్రియానుభూతుల సంచయం మాత్రమేనన్న నిర్ధారణకు దారితీస్తుంది.

ఈ అభిప్రాయాన్నే బెర్క్లీ అను ఇంగ్లీషు బిషప్ 18 వ శతాబ్ది ప్రారంభంలో వెల్లడించాడు. తన భావవాద సిద్ధాంతంయొక్క ఉద్దేశం, భౌతికవాదాన్నీ నాస్తికవాదాన్నీ ఖండించి, భగవంతుని అస్తిత్వాన్ని నిరూపించడమేనని అతడు బాహాటంగా తెలియజేశాడు.

స్వీయాత్మక భావవాదం మన అనుభూతులకూ, పదార్థాలకూ మధ్యనున్న వాస్తవ సంబంధాన్ని అపభ్రంశ (Distort) మొనరుస్తుంది. ఇంద్రియాలు పొందే అనుభూతినీ, ఇంద్రియాలచేత గ్రహింపబడే వస్తువులనూ ఒకటిగా అది చూస్తుంది.

కాబట్టి, స్వీయాత్మక భావవాదంయొక్క మూలసిద్ధాంతం తప్పక యీ క్రింది నిర్ధారణకు దారితీస్తుంది : వస్తువులూ, వాటిని గురించిన ఇంద్రియానుభూతులూ ఒకటే. అటువంటప్పుడు యావత్ప్రపంచాన్నీ నేనే సృష్టించానని, నా చైతన్యమే సృష్టించిందని నిర్ధారణకు రావలసియుంటుంది; మిగతా వ్యక్తులందరూ, నా తల్లిదండ్రులతో సహా, మానసిక ప్రతిబింబాలు; ఇంద్రియానుభూతులు, భౌతికమైన అస్తిత్వం వారికి లేదు. అందుచేత. స్వీయాత్మక భావవాదం తప్పనిసరిగా సొలిప్సిజంకు దారితీస్తుంది ('సోలప్'